# రెండు కన్నీటిచుక్కలూ - ఒకప్రశ్న

ఏడు మైళ్ళదూరం బస్సులో ప్రతిరోజులాగే ఆవేళ సాయంకాలంకూడా ప్రయాణం చేసొచ్చి చీకటి పడుతుండగా చెమటపట్టి జిడ్డుదేరిన ముఖమూ, అలసిపోయి విశ్రాంతికోరే చూపులూ, నొసట చికాకు గీతలూ, చెదిరి ముఖం మీదకువడి విసుగెత్తించే తలవెంట్రుకలతో యింటినిచేరుకుంది భ వా ని. టీ చేసుకుని తాగాలి, రేడియో పెట్టుకుని వినాలి, స్నానంచేసి రావాలి అనే అల్పమైన అతిసాధారణమైన కోరికల వెనక ఆమె హృదయంపడే ఆందోళనా, నిస్పృహల్ని అర్థం చేసుకోవడానికి ఆ యింట్లో — ఆ పదీ యింటూ ఆరు చదరపుగజాల గదిలో-మరొకరు లేరు. లేబ్ అసిస్టెంటుగా వుద్యోగం. ఏడు మైళ్ళదూరం ప్రయాణంచేయాలి. పగలల్లా ఏసిడ్‌లూ, వాటి ఘాటైన, ఇబ్బంది కరమైన వాసనలూ, టెస్ట్‌ట్యూబులూ, ఎన్ ఎ టూ సి ఒ త్రీలూ, పుష్ప సౌరభం దానికొమ్మకు అంటుకున్నంతగానైనా లలితకళల వాసన అంటని అతి ప్రాక్టికల్ మనుషులూ, ఎప్పుడయినా నవ్వినా నైట్రస్ ఆక్సైడ్‌వల్లతప్ప స్వత హాగా నవ్వని ముడుచుకుపోయిన వాళ్ళముఖాలూ, బున్సెన్ బర్నర్‌ల కాంతులు ప్రతిఫలిస్తేతప్ప జ్యోతుల్ని నింపుకోని ఎండిపోయిన వాళ్ళ కళ్లూ — వీటిమధ్యే గడిపి, మర్చిపోయిన దేన్నో వెతుక్కుంటూ వచ్చినట్టు సాయంకాలానికి యింటిని చేరుకోవడం ఉద్యోగరీత్యా ఏర్పడిన దినచర్య ఆమెకు.

ఓ స్నేహితురాలి యింట్లో తక్కువ అద్దెకు ఓ గది తీసుకుని వుంటోంది. రెండేళ్ళు తోడుగా వుండి; న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ చదివిన, ట్రాంబేలో ఆటామిక్ రియాక్టరులో వుద్యోగం చేస్తోన్న ఆంధ్ర యూనివర్సిటీ స్టూడెంటును పెళ్ళిచేసుకుని, అదృష్టాన్ని గంపలకెత్తి ఆర్నెల్లకిందటే అతని వెంట బొంబాయి వెళ్ళిపోయింది స్నేహితురాలు. స్నేహితురాళ్ళిక లేరు. కాని—

గాయం రేగింది. తేనెటీగలా రేగిన ఆ బాధ దూరంగా పోక, ఆమె కళ్ళచుట్టూ తిరిగి కళ్ళలో తడిసీ, ఆ తడిమీద ఎరుపురంగునూ అద్దింది. పొడి

పొడిగా చీకటి రాలుతోన్న ఆ సమయంలో యింటి అరుగుమీద కూర్చున్న ఆ యింటివాళ్ళ రామానికిగాని, యింటాయనకుగాని ఆకళ్ళు కనిపించలేదు. ఆమె తలుపు తాళం తీసుకుని లోపలకెళ్ళింది. మళ్ళీ తలుపేసుకుని. లైటేసి కుర్చీలో కూలబడింది.

ఇవ్వాళ స్నానం చెయ్యాలనిలేదు. రేడియో పెట్టుకోవాలనిలేదు. బద్ధకం కాదు, బాధ. ఒక్కసారిగా ఏ మంటలోనో హృదయం కాలుతున్నట్టుకాక, ఒక్కొక్క ఏసిడ్‌చుక్కా పడి గాయమై కొద్దికొద్దిగా, మెల్ల మెల్లగా కాలుతున్నట్టు భరించలేని ఒకటే బాధ. మెలుతుత్తానికి పేగుల్లో మంటలేచి, వుండచుట్టుకుపోయి పుండై, నిలవనీయని, పైకగపడని బాధలాంటి బాధ. ఆ గాయం హృదయానిది. ఏ వొక్కచోటిదీకాదు. హృదయమంతా జ్వరం అవరించినట్టు, ఏ కొసనూ వదలకుండా అంతటా సమానంగా అలముకున్న గాయం అది.

నిస్త్రాణగావుంది భవానీకి. భాస్వరం యిగిరిపోయినట్టు శక్తంతా యిగిరి పోయింది. భోజనం చెయ్యాలనికూడా లేదు. హోల్డాలు పరచుకుని అర్థ రహితంగా, అడ్డదిడ్డంగా, దానిమీద వాలిపోయింది. ఏకాంతంలోకి రాగానే యింతవరకూ లోలోపలే ఆమె అణచిపెట్టుకున్న ఆవేదన, సభ్యత్వం ముసుగు కింద తన్నుతాను వంచించుకొంటూ దాగిన బాధ హృదయంలోంచి పొర్లి పోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. ఏడవడం యిష్టంలేక, తడుస్తున్న కళ్ళ రెప్పల్ని పైకెత్తి నాలుగుసార్లు టపటపా కొట్టుకుని పొడిగా చేసుకుంది. ఆ తర్వాత అర్థగంటకు నిద్రపోయింది. బాగా అలసిపోయిన దానిలాగ పొద్దుటివరకూ మత్తుగా నిద్రపోయింది.

ఉదయం తెలివి వచ్చేసరికి ఆకలీ, నీరసం రెండూ అనిపించాయి. కదలలేక చాలాసేపు అలానే వుండిపోయింది— రాత్రి వచ్చిన కలని జ్ఞాపకం చేసుకుంటూ. ఆ కల ఎంతకీ జ్ఞాపకం రావడంలేదు. అప్పుడే మరపు తెరలోకి వెళ్ళిపోయింది. ఒకటి మాత్రం గుర్తుంది. అందులోని వ్యక్తి భీమేశ్వరరావు!

ఆమె ముఖం మళ్ళీ మ్లానమైపోయింది. మత్తుగా, నిర్మలంగా వున్న ముఖంమీద విషాదగీతలు వాలి గూడు కట్టాయి.

భీమేశ్వర్రావూ, తనూ రైల్లో ప్రయాణం చేస్తున్నారు. ఆ రైలు పట్టాల్ని తప్పించుకొని రోడ్లమీదే నడుచుకొస్తోంది. ఒకచోట ఎక్కడో పడిపోయింది. తనకు దెబ్బలుతగిలాయి. అతను ఏమయ్యాడో కనిపించడం లేదు. కాని ఎక్కడినించో తననే పిలుస్తున్నాడు. ఆ తర్వాత.... ఏమో.... జ్ఞాపకం రావడంలేదు. చాలా పెద్దకలే! అంతా మర్చిపోయింది.

ఆకలికి పేగుల్లో కొద్దిగా మంటపెట్టింది. నీరసంగావున్నా లేవక తప్పలేదు. ముఖం కడుక్కొని టీ చేసుకుని తాగింది. మళ్ళీ పడుకుంది. నిద్రపోదామనికాదు, వట్టినే దొర్లుతోంది.

భీమేశ్వర్రావు తనని మోసం చెయ్యలేదు. తనే తనని మోసం చేసుకుంది_ అనుకుంది భవాని.

అతను మంచివాడు. అతనిమీద ఆశపెట్టుకుని, అతని మంచితనాన్ని తను వుపయోగించుకోవడానికి ప్రయత్నించడం_ అది తన తెలివితక్కువే. కాని ప్రయత్న పూర్వకంగా అతను కొన్ని విషయాల్ని దాచాడు.

నాలుగురోజులుగా అతను లేబరేటరీకు రావడంలేదు. చెప్పాచెయ్యకుండా ఏమయ్యాడో అర్థంకాలేదు. ఓ సాయంకాలం అతని రూమువైపుగా వెళ్తే తలుపు తాళం వేసివుంది. నిన్న తెలిసింది. కళ్ళద్దాల బట్టబుర్ర కెమిస్టు భీమేశ్వర్రావును గురించి అడిగితే నటేశన్ చెప్పాడు. వాళ్ళావిడకి సీరియస్‌గా వుందని యింటిదగ్గరనుంచి వైరొచ్చిందట. దీర్ఘరోగం అట ఆమెకు.

అంతే, ఆరోజిక ఎక్స్‌పెరిమెంటు చెయ్యలేకపోయింది. కలిపిన సొల్యూషన్లు అటుదిటూ, యిటుదటూ అర్థంలేకుండా టెస్ట్‌ట్యూబుల్లో మార్చి, చేతులమీద వంపుకుని మతి చలించినదానిలా ఆ సాయంకాలంవరకూ కూర్చుంది.

తనకు పెళ్ళియినట్టు ఎప్పుడూ అతను చెప్పలేదు. ఆర్నెల్లైఅయ్యింది మరీ సన్నిహితంగావచ్చి. ఓ వర్షాకాలం వర్షంలో తడుస్తోన్న అతనికి బస్‌స్టాపు వరకూ గొడుగుపట్టింది_ అదీ పరిచయం! అంతకుముందు కేవలం ముఖ పరిచయమే. అదే లేబ్‌లో అదే అసిస్టెంటు అతను. తెలుగువాడే. చాలా సరదాగా నవ్వుతూ మాట్లాడగలిగే మనిషి ఆ లేబ్‌లో అతనొక్కడే. విపరీతంగా

పుస్తకాలు చదువుతాడు. చాలా విషయాలు తెలుసు అతనికి. అతను మాట్లాడు తుంటే- అదో ప్రవాహం! అప్పుడప్పుడూ రూముకువచ్చేవాడు. గంటలతరబడి విచిత్రమైన సంగతులు చెపుతూ మాట్లాడేవాడు.

నల్లగా వంకీలు తిరిగిన జుత్తు, పల్చటి అద్దాలపైన సన్నటి రోల్డుగోల్డు రిమ్‌వున్న కళ్ళద్దాలు, ఆ లోపల చిన్నచిన్న సన్నని కళ్లు, మధ్య-రాత్రివాలిన మంచు ఆకుకొసమీది బిందువై కిందకు జారిపడబోతున్నట్టు సాగిన అందమైన పొడుగాటి సూదిముక్కు, దూరంగా సాయం సంధ్యావేళ ఆకాశంలో ఎగురు తోన్న కొంగరెక్కల్లా మెలితిరిగిన సన్నటి పెదాలు, దిగువ అగాధం పక్కనే నిలచిన కొండశిఖరంపైన సమతలంగా చెక్కినట్టున్న గెడ్డం - భీమేశ్వరరావుది అందమైన రూపం యౌవ్వనం విరిసిన పుష్టి శరీరం. తెల్లబట్టల్లో మరీ అందంగా వుంటాడు.

అతను అందగాడు. తనచూపులు తనని మోసం చెయ్యలేదు. తన మనస్సే తనని మోసంచేసింది. అతని ఆలోచనలచుట్టూ సీతాకోక చిలుకలా ఎగిరింది. అతనికి కనబడాలని అతని ఎదుట రెక్కలు ఆడిస్తూ రాగం తీసు కుని తిరిగింది. వెడల్పయిన అతని భుజాలమీద, బలమైన అతని పిడికిలిలో తన భవిష్యత్తును ఊహించుకుంది. కాని యీనాడు....

గట్టిగా రెండుచేతుల్తోనూ కళ్లు మూసుకుంది. కంటి కొసల్లో వేళ్ళకు తడి తగిలితే చటుక్కున చేతులు తీసుకుని, లేచి అద్దం ముందుకెళ్ళి నుంచుంది. అయిదు నిమిషాలు అలానే తనముఖాన్ని చూసుకుంది. యౌవ్వనంతో బిగిసిన తామర మొగ్గల్లాంటి కళ్ళూ, దేవాలయ సింహద్వారంమీద నల్లరాతిపై చెక్కిన సన్నని ఆర్చిల్లాంటి కనుబొమలూ, దట్టమయిన సాంబ్రాణి ధూపంమధ్య గర్భ గుడిలో నిశ్చలంగా వెలుగుతోన్న ఆముదపు దీపంలాంటి లావుగా, సన్నగా, పొడుగ్గా సాగిన ముక్కూ, విచ్చుకున్న దానిమ్మపువ్వులాంటి నోరూ, సిగ్గు కందిన చెక్కిళ్ళూ-యివన్నీ కలిసి పొందికగా, నిండుగా అమరిన అందమైన తన ముఖాన్ని చూసుకుంది.

అంత బాధలోనూ ఆమె పెదాలమీద చిరునవ్వు గర్వంతో మెరిసింది. విషాదనాయిక నవ్వినట్టు, యింకా తడిఆరని సమాధిమీద గడ్డిపువ్వు చూసి నట్టు, చీకటి మబ్బుల్లో మునిగికూడా ఏ మూలనుంచో చంద్రుడు తొంగిచూసి

పలకరించినట్టు, చిదగ్గొట్టేసిన శిల్పం ముఖంలో పెదాలమీద రాలిపోక వేలాడుతూ చిరునవ్వు నిలిచినట్టు వుంది- ఆమె నవ్వు.

కళ్లల్లో తడిని పవిటచెంగుతో తుడుచుకుంది. ముఖంమీదకు జారుతోన్న జుత్తును వెనక్కు నెట్టుకుంది. ఓసారి భారంగా నిట్టూర్చి అక్కడనుంచి కదిలి వెళ్ళిపోయింది. ఆ రోజు ఏ ఉత్సాహమూలేక నీరసంగా మామూలు దినచర్య గడిచిపోయింది. ఆ సాయంకాలం ఆఫీసర్ని కలుసుకుని నెలరోజులు ఎర్నడ్ లీవు పెట్టి, దగ్గరుండి గ్రాంటు చేయించుకుంది. ఇంటికొచ్చి మర్నాడు స్వగ్రామం వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుంది.

సరిగ్గా మూడేళ్ళయ్యింది స్వగ్రామంనించి వచ్చి. వచ్చిన తర్వాత ఒక ఏడాదికి గాబోలు యింటికి వెళ్ళింది. మళ్ళీ వెళ్ళలేదు. అక్కడొక యిల్లూ, పెళ్ళయిన అక్కా, ఆరెకరాల పొలమూ వున్నాయి. ప్రస్తుతం వాళ్ళమ్మకూడా అక్కడే వుంటోంది. కొన్నిరోజులు ఆ కూతురిదగ్గరా, మరికొన్ని రోజులు యీ కూతురి దగ్గరా వుంటుందామె. ఆమె అక్క చదువుకోలేదు. ఏదో పల్లెటూరి చదువు. బావ స్కూలు ఫైనలు వరకూ వెళ్ళి ఆగిపోయి వ్యవసాయంలో పడిపోయాడు. కావలసిన సంబంధమే. ఇల్లరికంవచ్చి వుండిపోయాడు. తండ్రిపోయాక బావే ఆ యింటికి దిక్కయ్యాడు. అదృష్టవశాత్తూ ఆమె యీడేవున్న కరణంగారి అమ్మాయి స్నేహంవల్ల చదువు అబ్బింది భవానీకి. ఆ తర్వాత ఊరిలో చదువు, నగరంలో ఉద్యోగం. నిజానికి ఉద్యోగం చెయ్యాల్సిన అవసరంలేదు. ఇటీవలే బేరన్ పొగాకువేసి బాగానే లాభాలు సంపాదించాడు బావ. కాని ఆ చిన్నవూళ్ళో వుండడం యిష్టంలేదు. ఏ ట్రేజడీ కథలోని గ్రామమో అనిపిస్తుంది!

ఆ రాత్రల్లా గతంలోకి దిగివెళ్ళి అటూయిటూ తిరిగొచ్చింది. ఎత్తయిన కొండశిఖరంమీద నిలుచుని అడుగున లోయలో వున్న దృశ్యాన్ని చూసినప్పుడు మరీ అందంగా, వింతగా, ఆకర్షణీయంగా అనిపించినట్టు వుంది యౌవ్వనంలో నిలుచుని బాల్యాన్ని చూస్తుంటే.

దూరంగా అగాధంలో ఓ చీకటి కొసలో వెలుగురేఖవైపు వంగివున్న ఒక దృశ్యంమీద ఆమె చూపులు ఆగిపోయాయి. చాలా సేపు దూరదర్శిని కళ్ళతో చూపులు ఆ చుట్టూ తిరిగాయి.

చిన్నప్పుడు స్కూలు ఫైనలు చదువుకునే రోజులవి. రెండు మైళ్ల దూరంలోవున్న పక్కవూళ్ళోని హైస్కూల్లో చదువు. కరణంగారికి జట్కా బండి వుంది. మరో యిద్దరు అమ్మాయిలుకూడా వచ్చేవారు. కుర్రాళ్ళు మాత్రం నడిచే వచ్చేవారు. అరడజను మంది అబ్బాయిలు వాళ్లు అబ్బాయిలు కలిసికట్టుగా వచ్చి, కలిసికట్టుగా ఆడుకుంటూ పాడుకుంటూ వెళ్ళిపోయేవారు. ఎగువ వీధి పాపారావుచేత పద్యాలూ, పాటలూ దారిపొడుగునా పాడించుకునే వారు. ఒక్కొక్కప్పుడు ఆలస్యంగా బయలుదేరి జట్కాబండి వాళ్ళను దాటు కుంటూ వెళ్లినప్పుడు ఆ పాటలు వినిపించేవి తమకు. పాపారావుకూడా తన క్లాసే. మరీ చిన్నప్పుడు జోరీగ పెట్టేవాడు. మొట్టికాయలు మొట్టేవాడు. కాకి ఎంగిలిచేసి జాంకాయలు పంచుకునేవారు. హైస్కూలుకి వచ్చాక కొత్తవాళ్ళల్లా అయిపోయారు. ఒకరినొకరు ఏడిపించుకోవడాలు లేవు, మామూలు పలక రింపులు తప్ప.

ఒకరోజు సన్నగా మడిచిన కాగితం ఒకటి యిచ్చాడు. విప్పిచూస్తే అదొక ప్రేమలేఖ! కోపం వచ్చింది తనకు. హెడ్ మాష్టరుకు చూపించింది. అతన్ని పిలిచి, చీవాట్లుపెట్టి వారం రోజులు సస్పెండ్‌చేశారు. ఆ విషయం వాళ్లింట్లో తెలిసి వాళ్లనాన్న కొట్టాడట కూడా. ఆ తర్వాత అతను అదో రకంగా తయారయ్యాడు. ఎక్కువగా ఎవరితోనూ కలిసి తిరిగేవాడు కాదు. పాపం! మంచివాడు. స్కూలుఫైనలు పాసయి ఆ ఊళ్ళోనే ఉద్యోగం సంపాదించుకున్నాడు రెండేళ్ళకిందట శుభలేఖకూడా వచ్చింది.

ఆనాటి అతని మౌనం వెనుకవున్న బాధ యిప్పుడు తనకు అర్థమవు తోంది. కాని ఆ బాధ తనకు పెట్టకుండా అందరూ వూరించుకుని మామిడి కాయలు తింటుంటే చంటిపిల్లాడికి కలిగిన బాధలాంటిది. ఎండలో తిరిగితే వచ్చిన తలనొప్పి బాధ లాంటిది. శాశ్వతంగా వుండదది. మచ్చ కూడా మిగలదు. మరీ చిన్నతనం. పరిపక్వం చెందని భావాలు. ఏదో కావాలని ఆశ తప్ప ఆ కోరికలో బలమైన ఉద్రేకం, ప్రేరణా వుండవు.

భవానీకి ఆ రాత్రల్లా ఆలోచనల్లోనూ, కలల్లోనూ బాల్యమే కదిలింది.

ఉదయం బజారుకెళ్ళి అక్క పిల్లలకని బట్టలవీ కొనుక్కొచ్చింది. ఇంటికొచ్చేసరికి ఇంటివాళ్ళ రామం 'ఉత్తరం వచ్చింది' అంటూ కవరు ఒకటి యిచ్చాడు. స్నేహితురాలు రాసిన ఉత్తరం అది.

భర్తతో ఎలిఫెంటా గుహల్లో ఒక సెలవురోజునాటి ఆమె అనుభవాన్ని రాసింది.

'అదృష్టవంతురాలు' అనుకుంది ఆమె.

అందమైన జీవితం. తన యీడే. తన చదువే. కాని అదృష్టం వేరు.

ఆమె అనుకుంది___

యవ్వనం విరిసిన వెన్నెల్లాంటిది. ఎగుడు దిగుడుల్లేని మైదానం వంటి సమతల జీవితాల్లో అది నిండుగా కాస్తుంది. కాని, ఎత్తుపల్లాల గతుకుల బతుకుల్లో చీకటి నీడల్నే సృష్టిస్తుంది.

మనసు బాగోక సెలవుపెట్టి స్వగ్రామం వెళ్తున్నట్టు — ఆ మనసు బాగోక పోవడానికి గల కారణం కూడా చెప్పి — బొంబాయి స్నేహితురాలికి ఉత్తరం రాసిపడేసింది. ఇంటివాళ్ళకి కూడా చెప్పింది. ఇంటివాళ్ళ రామం బయట అరుగుమీదే వున్నాడు. ఊరెళ్ళుతున్నానంటే రిక్షా పిలుచుకొచ్చాడు.

రెండేళ్ళ తర్వాత మళ్ళీ వెళ్లడం. నిజానికి, ఏడేళ్లుగా ఆ గ్రామం పరాయి గ్రామంలాగే అయిపోయింది. కాలేజీలో చదివిన నాలుగేళ్ళూ సెలవల్లో మాత్రమే వెళ్తుండేది. ఆ తర్వాత మూడేళ్ళుగా వుద్యోగం.

స్వగ్రామంనించి బయలుదేరి వచ్చినప్పుడు దారిపొడుగునా తను జార విడుచుకున్న గతాన్నంతా ఓపిగ్గా రైల్లో కూర్చుని ఏరుకుంటోంది.

ఊరు దూరమయ్యేకొద్దీ నక్షత్రాల్లాంటి దీపాలతో మరీ అందంగా కనిపించినట్టు గతంలోని సంఘటనలు కాలం సృష్టించిన దూరంలో మరీ అందంగా కనిపిస్తాయి. శివార్లలోంచి ఊరును చూసినప్పుడే దానికి అందం. అలానే వర్తమానంలోంచి గతమూనూ.

బాల్యంలో సీతాకోక చిలుకల వెంట, పాల పిట్టలవెంట కోరికల రెక్కలు కట్టుకుని ఎగిరిన దినాలు.... యవ్వనారంభంవేళ తలపులమీద

వసంతం చల్లుకున్న రోజులు....వయసులో భవిష్యత్తును గూర్చి కన్న కలలు .... .... మధ్యమధ్య తెగిపోయిన ఆలోచనల్లోంచి నిద్రపోతున్న రైలుస్టేషనూ, చీకట్లో ఎగురుతోన్న ఓ మిణుగురుపురుగూ, పక్కనే తల్లి ఒడిలోని చంటిపిల్ల ఏడుపూ, రైలు అరుపూ, ఎగిరొచ్చిన ఓ చూపూ, దాని అవతలి కొసను చిన్న చిరునవ్వూ, దానిమీద అంటుకున్న మలినమూ, మలినపడిన ముఖంతో భీమేశ్వర్రావూ, కన్నీళ్ళూ, చీకటి .... ....

రాత్రి గడిచిపోయింది.

ఉదయిస్తోన్న సూర్యుని ఏటవాలు కిరణాల మధ్యనుంచి ముందుకు వెళ్ళిపోతోంది రైలు. మరో గంటన్నర ప్రయాణం వుంది. బండి ఏదో పెద్ద స్టేషన్లో ఆగడంతోనే గబగబా దంతధావనం పూర్తిచేసింది భవాని. రాత్రి నిద్రలేదేమో మత్తుగా, అలసటగావుంది. టీ వస్తే పుచ్చుకోవాలనుకుంది. కాని కిటికీదగ్గర అటూ యిటూ మగాళ్ళే. కాలు పెట్టడానిక్కూడా వీల్లేకుండా వున్నారు. ఒకతను టీ పుచ్చుకుంటుంటే క్షమాపణలు చెప్పుకుని ఓ కప్పు యిలా యివ్వమంది.

"దానికేముందండీ" అంటూ మరో కప్పు అందుకుని ఆమెకిచ్చాడు. తాగేసి, డబ్బులిచ్చేసింది.

బండి కదిలిన తర్వాత "ఎంతవరకూ వెళ్తున్నారు?" అన్నాడు అతను.

'ఇంత మాత్రానికే సంభాషణలోకి దించుతున్నాడే!' అనుకుంది ఆమె. వినిపించుకోనట్టు మౌనంగా వుండిపోతే, మళ్ళీ అదే ప్రశ్న వేశాడు అతను.

ఆమెకు విసుగొచ్చింది. ''చాలా దూరం వెళ్ళాలి'' అంది.

ఏమనుకున్నాడో పదినిమిషాలు ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత "చూశారా! ఇప్పటికే రెండు గంటలులేటు యీబండి. బెజవాడ వెళ్ళేసరికి యింకెంత లేటో" అన్నాడు.

ఆమెకు విసుగేకాదు, కోపంకూడా వచ్చింది. నిర్లక్ష్యంగా వినీ విననట్లు వూరుకుంది.

అతను కొద్దిసేపు ఆమె ముఖంలోకి చూసి, అంతకు క్రితమే కొన్న దినపత్రిక మడతలు విప్పి, అందులో ముఖాన్ని దాచుకున్నాడు.

'మగాళ్ళంతా యింతే. స్త్రీ బలహీనతని తమ ప్రయోజనానికై వుపయోగించుకోవాలని చూస్తారు. పురుషుని పలకరింపులో ఆసక్తీ, ఆధిక్యతా తప్ప స్వతహాగా స్త్రీలోవుండే అభిమానం, సానుభూతీ ఎక్కడివి?' అనుకుంది ఆమె.

బెజవాడ వచ్చేవరకూ ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు. ఒకరిద్దరు ఆడవాళ్ళు పలకరింపులు చిలకరించినా, వాళ్ళపక్కనున్న మగాళ్ళ చూపులు యిటు తిరగడం చూసి, ఆ చూపుల్లో పరదా వేసుకోని సిగ్గులేని ఆసక్తిని గుర్తించి నిర్లక్ష్యంగా కూర్చుండిపోయింది.

బెజవాడలో దిగిపోయింది. అక్కడనుండి బస్సులో మరికొంతదూరం ప్రయాణం చెయ్యాలి.

బస్సుస్టాండుకు వెళ్ళేసరికి సిద్ధంగావుంది బస్సు. అయిదు నిమిషాల్లో కదిలింది.

పాత జ్ఞాపకాలు దారిపొడుగునా తోరణాల్లా వేలాడుతున్నాయి. అప్పుడప్పుడు మధురమైన పిల్లగాలులు వీచి, తోరణాల్ని కదిలించి సరిగమల్ని పలికిస్తున్నాయి. ఇల్లు దగ్గరవుతున్నకొద్దీ ఆమె హృదయం ఆనందంతో, ఆతృతతో ఉక్కిరిబిక్కిరౌతోంది. రైల్లో ప్రతి పదినిమిషాలకూ ఒకసారయినా జ్ఞాపకానికొచ్చిన భీమేశ్వర్రావు యిప్పుడు జ్ఞాపకం రావడం లేదు. తాటిచెట తలలు, పాలపిట్టల రెక్కల చివరి రంగులు, తలపాగాల మనుషులు, తాటాకు పాకలమధ్య చెదురు చెదురుగా పెంకుటిళ్ళు — యివే కనిపిస్తున్నాయి.

గంట గడిచింది. ఊరు దగ్గర పడింది.

ఆమె చూపుల చివర, నల్లని తారురోడ్డు అవతలి కొసను మర్రిచెట్ల తలలకింద గోపీచందనం రంగులో క్షణంపాటు ఓ డాబా మెరిసి ఏపుగా పెరిగిన పొగతోట వెనక తాటితోపులో మరుగుపడిపోయింది.

'అదే....అదే!' అనుకుంది ఆమె.

క్షణంలో అది దగ్గరయి, ఎదుటపడి పక్కకు తప్పుకుని వెనక్కువెళ్ళిపోయింది—ఒకప్పుడు పాకగా వుండి యిటీవలే డాబాగా వెలసిన చిన్ననాటి స్కూలు!

ఫర్లాంగుదూరంలో యివతల ఊడలతో ఓ మర్రిచెట్టు. ఇక్కడే ఒకసారి పాపారావును పిల్లలంతా ఏడిపించారు. వెనకాల తమ జట్కా బండిని చూసి, కూడావున్న పిల్లలు తమ యిద్దరి పేర్లూ జోడించి అరుస్తూ ఏడిపించారు. పాపారావుకూ, మరో అతనికీ కుస్తీపట్లు కూడా జరిగాయి. పాపం! ఆ మరుచటి రోజున పాపారావును క్లాసులో చూసినప్పుడు అతని మోచెయ్యి గీరుకుపోయి కనిపించింది.

భవానీ కళ్ళల్లో పాపారావే కదులుతున్నాడు. జాలిగా, కిందకు వాలి పోయిన చూపుల్తో భారంగా, హృదయాన్ని కళ్ళల్లో నిలిపి చూస్తున్నాడు.

'ఇంటికి వెళ్ళిన తర్వాత వీలుచూసుకుని ఒకసారి పాపారావు వాళ్ళ యింటికి వెళ్ళిరావాలి. వాళ్ళావిడనికూడా ఒకసారి చూడాలి' అనుకుంది భవాని.

పాపారావు ఆలోచనల్లోంచి తేరుకునేసరికి బస్సు ఊర్లోకొచ్చి స్టాండులో ఆగింది.

భవాని దిగడంతోనే, ఉబుసుపోక స్టాండులో కూర్చున్న సత్తయ్య పలకరించాడు. ఆ పలకరింపు విని మరో యిద్దరు ముగ్గురు ఎరిగున్న వాళ్ళు దగ్గరకొచ్చి యోగక్షేమాలు అడిగారు. వాళ్ళల్లోనే ఒకడు పెట్టెతీసుకుని యింటికి బయలుదేరాడు.

అకస్మాత్తుగా వచ్చిన కూతుర్ని చూసి ఆశ్చర్యపోయింది తల్లి. "ఉత్తరం ముక్కన్నా రాసేవు కాదేమే!" అంది.

''ఒకసారి వచ్చెళ్ళమని మాటిమాటికి నువ్వు రాస్తూవుంటే నీ పోరు పడలేక సెలవుపెట్టి వచ్చేశాను'' అంది.

ఆ సమాధానం ఆ తల్లి కళ్ళల్లో వెయ్యి జ్యోతుల్ని నిలిపింది. తల్లిగా తను కూతురి విషయంలో నెరవేర్చదలచిన ఒక్కగానొక్క బాధ్యతా తీరి పోయే శుభసూచన కనిపిస్తున్నందుకు ఆ తల్లి, ఆనందాన్ని పట్టలేక వాత్సల్యపు చూపులతో కూతుర్ని చుట్టుముట్టి, తలనిమిరి లోపలకు తీసుకెళ్ళింది.

సరిగ్గా పదిహేను రోజులయ్యింది, ఒకసారి రమ్మని వుత్తరం రాసి. 'ఇప్పుడు రావడానికి వీలుపడదు. సెలవు లేదు' అని జవాబు రాసింది భవాని.

అలా రాసిన భవాని అకస్మాత్తుగా వూడిపడితే ఆ యింటిల్లిపాదికీ ఆశ్చర్యం గానూ, ఆనందంగానూ వుంది.

ఆరోజు భవానీకి పలకరింపులతో, పరామర్శలతో, ఊపిరిసలపని అభిమానపు పన్నీటి చిలకరింపులతో, ఆప్యాయత రంగరించిన చల్లని చూపుల మంచిగంధపు పూతలతో, వర్తమానమేతప్ప గతంలేని ఆలోచనలతో, పొడి కళ్ళతో, తడి పెదవులతో, హాయిగా, ఆనందంగా గడిచిపోయింది.

మర్నాడూ అంతే.

మూడోరోజున, ఆమె వచ్చిందని తెలిసి చూద్దామని వచ్చాడు బ్రహ్మానందం.

ఆ చిన్నవూళ్లో కాలేజీ చదువులవరకూ వెళ్లగలిగిన ముగ్గుర్లోనూ అతను ఒకడు. స్కూలు ఫైనలువరకూ ఆమెతోపాటు కలిసి చదివి, కామర్సు గ్రూపు తీసుకుని బి.కాం. తర్వాత మూడేళ్లు ఎం.బి.ఎ. చదివాడు. ఓపిగ్గా కూర్చొని డొంకంతా కదిపి వెతికితే ఏవో రెండు మూడు రకాల దూరపు చుట్టరికాలు కలుస్తాయి భవానీకి, అతనికి.

"ఏం చేస్తున్నావిప్పుడు ?" అంది భవాని.

"ఏమీ చెయ్యడంలేదు. ఎం.బి.ఎ. పరీక్షలు రాశాను. వారం పదిరోజుల్లో రిజల్సు రావాలి. వస్తే, బొంబాయివెళ్లి ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యాలను కొంటున్నాను" అన్నాడు.

'అదృష్టవంతుడు. బీదవాడుగాపుట్టి, డబ్బున్నవాళ్ళింటికి దత్తపుత్రుడై వెళ్ళి లక్ష్మీదేవి కటాక్షాన్నేకాక సరస్వతీదేవి చల్లని చూపును కూడా సంపాదించు కున్నాడు'—అనుకుంది భవాని.

"నువ్వు వెనకటిలాగానే వున్నావు. ఏ మార్పూలేదు. కొద్దిగా సన్న బడ్డావేమో కూడాను" అన్నాడు అతను.

"నిజమా ! ఏమో నాకు అనిపించడంలేదు." అంది చిన్నగా నవ్వుతూ. అలా నవ్వుతున్నప్పుడు పట్టణమూ, ఏడుమైళ్ళ సిమ్మెంటు బాటా, గాలిగోపురం మాదిరిగా పైకిలేచిన రీజినల్ లేబరేటరీ శిఖరమూ, శ్వాసనాళాల్ని మండించే ఘాటైన ఏసిడ్‌ల వాసనా, కొసల్నివంచి ముడుల్ని పెదాలమీద బిగించిన చిరు

నవ్వుతో భీమేశ్వర్రావూ, యవ్వనంలో పగిలిపోయిన కన్నీటి భాండంలో తడిసి తుప్పట్టిన తన జీవితమూ జ్ఞాపకానికొచ్చి చటుక్కున ఆపేసింది.

వాళ్లమ్మ కాఫీ పట్టుకొచ్చి బ్రహ్మానందానికి యిచ్చింది. అతను తాగిన తర్వాత మరికాస్సేపు అతని చదువూ, ఆ చదువుకు వచ్చే ఉద్యోగమూ, వాళ్ళ మేనమామకూ అతనికీ యిటీవల వచ్చిన గొడవలూ మొదలయిన విషయాలు మాట్లాడుతూ వుండిపోయాడు.

ఆ తర్వాత మరో గంటసేపయినా కూర్చుని వాళ్ళిద్దరూ మాట్లాడు కున్నారు. చిన్నప్పుడు తమతో చదువుకున్నవాళ్ళగురించీ, వాళ్ళ జీవితాలు ఎలాఎలా మలుపులు తిరిగాయో, చదువుచెప్పిన మేష్టార్లలో యింకా ఎంతమంది అక్కడే వున్నారో చాలా చాలా మాట్లాడుకున్నారు.

చాలాసేపు కూర్చుని అతను వెళ్ళిపోదామని లేచాడు.

"అప్పుడప్పుడు వస్తూవుండు బ్రహ్మానందం. ఏమీ తోచడంలేదు. ఈసారి వచ్చేటప్పుడు జనార్ధనాన్నీ, పాపారావునుకూడా తీసుకురా. ఈ పల్లెటూళ్ళో యింతకన్నా కాలక్షేపం యింకేంవుంటుంది" అంది.

అతను విచిత్రంగా ఆమెవైపు చూసి "నీకు తెలీదా ?" అన్నాడు.

ఆమెకు ఏమిటో అర్థంకాక చూస్తూ వుండిపోయింది.

"పాపారావుపోయి ఏడాది దాటింది. జబ్బేమిటో తెలీదు. రోజు రోజుకూ నీరసించిపోయి యీనెపుల్లలా తయారయ్యి,- మొన్న సంక్రాంతి కాక అటు కిందటి సంక్రాంతి సరిగ్గా నాలుగురోజులుందనగా పోయాడు. ఎవరో చేతబడి చేశారంటారు" అన్నాడు బ్రహ్మానందం.

భవాని నమ్మలేని నిజాన్ని వింటున్నట్టు కొద్దిసేపు అలాగే వుండి పోయింది. ఆ తర్వాత తేరుకుని "నిజమా! అంది. అంతకన్న ఆమెకు మాటలు పెగిలిరాలేదు.

పాపారావు కనిపిస్తే అతనిమీద చిలకరిద్దామని దాచుకున్న సానుభూతీ, జాలీ కళ్ళ కొసవరకూవచ్చి అక్కడే బంధీ అయిపోయాయి. రెప్పల్నికూడా ఆమె కిందకు వాల్చేసింది.

బ్రహ్మానందం ఏమీ మాట్లాడలేదు.

"పాపారావు చాలా మంచివాడుకదా. అతనికి చేతబడిచేసే శత్రువులు ఎందుకుంటారబ్బా" అంది చివరికి మెల్లగా తలెత్తి. పైకెత్తిన చూపుల్ని అతని ముఖంలో నిలపలేక పక్కలకు తప్పించేసింది.

ఆమె నోటిమీదుగా పాపారావును గురించి అలాంటి మాటలను వినేసరికి అతనికే ఆశ్చర్యం వేసింది. నిలవలేక పక్కలకు జారిపోతోన్న ఆమె చూపు లోని తడినీ, ముడిసడలిపోయి జారిపోయిన ఆమె పెదాలనూ, సంధ్య వాలి పోయాక ముంచుకొచ్చిన చీకటి వెల్లువలాంటి ముఖంమీది నలుపునూ అతను గుర్తించాడు.

"అతని పెళ్ళి చాలా గొడవలమధ్య జరిగింది. దగ్గర సంబంధంవుంటే కాదని వితంతువును పెళ్ళిచేసుకున్నాడు. ఒద్దని ఎవరెంతచెప్పినా వినలేదు. ఆ పెళ్ళికూడా గుళ్ళో జరిగింది. ఆ అమ్మాయి కాపరానికి వెళ్ళిన అయిదు నెలలకే భర్త పాముకాటువల్ల చనిపోయాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి పుట్టింటికి వచ్చేసింది. ఆమెకు ఇద్దరు మరుదులున్నారు. వారికి ఆమె మళ్ళీ పెళ్ళి చేసు కోవడం యిష్టంలేదు. ఈ పెళ్ళి జరగనివ్వకూడదని చాలా ప్రయత్నాలు చేశారు. బహుశా వాళ్ళే ఏదో చేతబడి చేయించివుంటారని అనుమానం'' అన్నాడు బ్రహ్మానందం.

తన పెదాలు కదులుతున్నట్టనిపించాయి భవానీకి- పై పంటితో కింది పెదవి నొక్కి పట్టుకుంది. కళ్ళల్లోతడి రెప్పలమీదకు పాకి పైకి లేవనివ్వడం లేదు. అలా కిందకు వాలిపోయిన చూపులు చీరమడతల్లోంచి, జాకెట్టు చోళీ పక్కనుంచి గుండెల్లో గుచ్చుకుపోయి ఊడిరావడంలేదు. బలవంతంగా కదిలించి ఆ ములుకుల్ని బయటికిలాగేస్తే బొట బొటా కన్నీళ్ళరక్తం కారి పోతుంది. బ్రహ్మానందం దాన్ని చూసేస్తాడు. అందుకే ఆమె చూపుల ములుకుల్ని బయటికి తీయలేదు.

''సరే వస్తాను. ఈసారి వచ్చేప్పుడు జనార్దనంవుంటే తీసుకొస్తాలే'' అని బ్రహ్మానందం వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయినా చాలాసేపు ఆమె అలా కిందకేచూస్తూ వుండి పోయింది.

పాపారావు యీ పెళ్ళి చేసుకోవడానికి కారకురాలు పరోక్షంగా తనే. తనమీద కక్ష తీర్చుకోవడానికే అతను యీ పెళ్ళి చేసుకున్నాడు. మరీ సున్నితమైన వ్యక్తి పాపారావు. మానసిక బలం యేమాత్రంలేని అతి మంచి మనిషి అతను. మరీ మంచి మనుషులు మానసికంగా బలహీనులైతే, యితరుల మీద పగసాధించుకోవడం సాధ్యంకానప్పుడు తమమీద తామే పగసాధించు కుంటారు. పాపారావు అల్లాంటివాడు. అతని ప్రేమను తిరస్కరించినందుకు, తనమీద మరోవిధంగా పగసాధించడం చేతకాక వితంతువును పెళ్ళిచేసుకుని, అతన్ని అతనే హింసించుకున్నాడు. ఈ విషయాన్ని ముఖ్యంగా తనకు తెలియజేద్దామనే కాబోలు ఆ రోజున శుభలేఖ పంపించాడు.

భవానీ అక్కవచ్చి భోజనానికి రమ్మంది. శిలమాదిరిగా కూర్చుండి పోయిన చెల్లెల్ని కదిపి, ఏమిటో అర్థంకాక చెల్లెలి ముఖంలోకి చూస్తూ వుండి పోయింది.

భవానీ చూపుల్ని పైకి లాక్కుంది. కానీ, కన్నీళ్ళరక్తం ఒలికిపోలేదు. హృదయంలో రేగిన జ్వాలలకు కన్నీళ్ళు ఆవిరైపోయాయి! దీర్ఘంగా ఓ నిట్టూర్పు మాత్రం బైటపడింది. అక్కడనుంచి లేచి అక్కవెంట వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆరోజు యిక మామూలు మనిషి కాలేకపోయింది. మధ్యాహ్నం భోజనం చేశాక నిద్రపోదామని మంచం వాల్చుకుని పడుకుందిగాని నిద్ర పట్టలేదు. ఇవే ఆలోచనలు. అక్కడికీ. సాయంకాలం వాళ్ళక్క అడగనే అడిగింది 'అదేమిటే! అలావున్నావూ?' అని.

"ఇక్కడ ఏమీ తోచడంలేదు. పట్టణంలో రణగొణ ధ్వనికీ, కంగా రుకూ అలవాటు పడిపోయానేమో యీ ప్రశాంతతను భరించలేకపోతున్నాను" అంది.

ఆ సాయంకాలం యింట్లో వుండలేక వాళ్ళక్కను వెంటేసుకుని కావలసిన వాళ్ళందరి యిళ్ళకూ వెళ్ళివచ్చింది.

రాత్రి నిద్రపోయేముందు యీ ఆలోచన వచ్చినప్పుడు ఆమెకే విసుగే సింది. కోపమూ వచ్చింది. 'పాపారావును గురించి తను యింతగా ఎందుకు ఆలోచిస్తోంది? తన గురించి తాను ఎలాగూ బాధపడుతోంది. ఇతరులగురించి

కూడా తానెక్కడ బాధ పడగలదు? తనకు ఏ బాధలూ లేకపోతే అప్పుడు ఆలోచించినా అర్థంవుంది. ఇదేమిటి! ఇది తెలివితక్కువతనమే' అనుకుంది. ఆ ఆలోచనను చెరిపివేయడానికై బలవంతంగా భీమేశ్వర్రావును జ్ఞాపకం చేసుకుంది. భీమేశ్వర్రావుమీద అసహ్యాన్ని పెంచుకుని, కోపాన్ని సృష్టించుకుని అతని ఆలోచనల్ని కూడా వొదిలేసి నిశ్చింతగా నిద్రపోయింది.

మధ్యలో ఎప్పుడో చటుక్కున తెలివి వచ్చేసరికి వీధి వసారాలోంచి ఏవో మాటలు వినిపిస్తున్నాయి. తనను గురించే. అమ్మ, బావ కంఠాల్ని గుర్తుపట్టింది. మరొకటి ఎవరిదోకొత్త కంఠం. తన ప్రస్తావనా, బ్రహ్మానందం ప్రస్తావనా మాటల్లో దొర్లుతోంది.

ఆమెకు అర్థమయిపోయింది.

కాని యిది నిజమే అని నమ్మలేకపోతోంది. బ్రహ్మానందానికి మేనమావ కూతురుంది. ఆ అమ్మాయి పుట్టినప్పుడే అతని పెళ్ళాం అన్నారు. మరి? ....

బ్రహ్మానందాన్ని ఎప్పుడూ ఆ విధంగా వూహించుకోలేదు. ఒక చుట్టరికం ప్రకారం ఆ సంబంధం అతకదు. మరో చుట్టరికం ప్రకారం మేనమావ అవుతాడు. రెండూ బాగా దూరపు చుట్టరికాలే.

బ్రహ్మానందం చామనఛాయ రంగే అయినా తనకన్నా తెలుపే. పక్కలకు జారిపోకుండా సూటిగా నిలిచే చూపులు అతనివి. వెలుతుర్లో నిలిచినప్పుడు గీతలుగీసి స్పష్టంగా చీకటి వెలుగుల్ని విడదీసే వలంపులు చుట్టిన వుంగరాలతల, యవ్వనంలో బిగువుగా, పుష్టిగా ఎదిగి, యిరుపక్కలకూ జారి, ప్రేమతో కొసలు నాజూకునూ, పదునునూ అలవరచుకున్న మీసాలు. స్నేహ సలిలాలతో, ప్రేమ కిరణాలతో ఏపుగా పెరిగి విశాలమై చీకటి నీడల్ని కురిపించే వెడల్పాటి ఛాతీ. పూలరేకలమీద చేరిన మంచుబిందువులు పుష్పగర్భంలోని మకరందాన్ని కరిగించుకుని, కాడలమీదుగా జారి ఆకుల్ని కూడా తడిపి తియ్యబరచినట్టు అతనిమీద వాలిన ఆలోచనలు అతని హృదయంలోని మంచితనాన్ని కరిగించుకుని చుట్టూవున్న ప్రపంచాన్నికూడా రసమయ జగత్తుగా చూపిస్తాయి.

అవును. అతను అందగాడే — అనుకుంది. తేలిగ్గా ఊపిరితీసి విడిచి, కళ్ళు మూసుకుంది.

ఉదయం వంటింట్లో కూర్చుని పెసరట్లు వెయ్యడంలో తల్లికి సాయం చేస్తూ వున్నప్పుడు వాళ్ళక్క కూడా వచ్చికూర్చుని అడిగింది. "వెంకటప్పయ్య గారి బ్రహ్మానందం నీకు నచ్చాడటే" అని.

ఆ ప్రశ్న అసలు తనకు అర్థమేకానట్టు అక్కవైపు చూసింది భవాని.

"డబ్బుకు డబ్బావుంది, చదువుకు చదువూ వుంది. ఉద్యోగం చేస్తే మూడు నాలుగు వందలన్నా జీతపురాళ్ళు రాలకపోవు. మనిషి నెమ్మదస్తుడు. ఇంతకన్నా యింకేం కావాలి. మన అదృష్టంకొద్దీ ఆ మేనరికం తప్పిందను కోవాలి" అంది వాళ్ళమ్మ.

భవానీ ఏమీ మాట్లాడలేదు. పెదాలమీద పూసిన చిరునవ్వు పూలను ఏరుకుని, దండగాగుచ్చి, వాళ్ళక్క మెడలోవేసి అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది.

'వచ్చే మాఘమాసంలో యీ కార్యం కాస్తా అయిందనిపించేస్తే నా బాధ్యత తీరిపోతుంది' అని అంటున్న వాళ్ళమ్మ మాటలు భవానికి వినిపిం చాయి. ఆలోచనల రెక్కలు తగిలించుకుని భవిష్యత్తులోకి ఎగిరిపోయింది.

నిర్విచారంగా ఆరోజూ, ఆ మర్నాడూ గడిచిపోయాయి. ఆ తర్వాత రోజున బ్రహ్మానందం వచ్చాడు.

మునుపటిలా స్వేచ్ఛగా పలకరించలేక పోయింది. సూటిగా అతని ముఖంలోకి చూడలేకపోయింది. మాటిమాటికీ అతని చూపులు తన యవ్వనాన్ని కొలుస్తున్నట్టనిపిస్తున్నాయి. ఇంతకు ముందుకన్నా మరీ అందంగా వున్నట్టని పిస్తున్నాడు. నవ్వినప్పుడు పెదాల కొసలమీంచి జారిన మడతలు చెక్కిళ్ళ మీదకు పాకుతూపోయి కళ్ళచుట్టూ పెనవేసుకుని చిరునవ్వు గీతల్ని సృష్టిస్తు న్నాయి. అందువల్ల ఆ కళ్ళు ఎప్పుడూ వెలుగుతూ వున్నట్టే అనిపిస్తుంటాయి. ముక్కపొడుంరంగు ఫేంటు, లేత బిస్కట్‌కలర్ బుష్‌కోటు బాగా సరి పోయాయి. బుష్‌కోటులోంచి కట్‌బనీనూ, దానికి గుచ్చిన సెఫియారంగు ఫైలట్ పెన్నూ కనిపిస్తున్నాయి.

ఎక్కువసేపు కూర్చోలేదు అతను. పనుందనిచెప్పి వేగంగానే వెళ్ళి పోయాడు.

ఆ తర్వాత అప్పుడప్పుడూ వస్తుండేవాడు. భవానీ అక్కడవున్న రోజుల్లోనే అతని రిజల్ట్సు వచ్చాయి. సెకండ్‌క్లాసులో పాసయ్యాడు. ఆవార్త విన్నతర్వాత, బంధుత్వాలు కలవబోతున్నాయి గనక, భవానీ అక్కా వాళ్ళమ్మా—యిద్దరూ బ్రహ్మానందం యింటికి వెళ్ళారు.

అప్పటినుంచీ ఆ రెండిళ్ళకూ రాకపోకలుకూడా ఎక్కువయ్యాయి.

సెలవులు అయిపోయాక భవానీ మరోవారం రోజులు పొడిగించింది. ఉద్యోగ ప్రయత్నాలకై బొంబాయి వెళ్ళడానికి భవానీతోపాటుగా హైద్రాబాదు వరకూ తనూ వస్తానని బ్రహ్మానందం చెప్తే ఆమె ఆగిపోయింది. కాని ఏవో కారణాలవల్ల అతను బయలుదేరలేదు. ఆ ప్రయాణాన్ని అతను మరో పదిహేను రోజులకు వాయిదా వేసుకున్నాడు. ఆమె మాత్రం బయలుదేరింది. ఆమెను దిగబెట్టడానికి భవానీ బావతోపాటు బ్రహ్మానందంకూడా బెజవాడ వరకూ వెళ్ళాడు.

'బ్రహ్మానందం! నువ్వున్నావు గనుక యీ వూళ్ళో ఇన్నిరోజులుండ గలిగాను. హాయిగా గడిచిపోయింది. నువ్వు లేకపోతే ఎప్పుడో నేను తిరుగు ప్రయాణం కట్టేసివుండేదాన్ని' అంది భవాని బండిలోకి ఎక్కికూర్చుని. అతను కిటికీ దగ్గర నుంచున్నాడు. ఆమె బావ మామిడిపళ్ళ బుట్టల్నీ, ఆవకాయ జాడీని ఒకచోట జాగ్రత్తగా సర్దిపెడుతున్నాడు.

అతనేమీ మాట్లాడలేదు. నవ్వి వూరుకున్నాడు.

బండి కదలబోతుండగా వాళ్ళబావ దిగొచ్చాడు. ఇద్దరూ బండితోపాటు కొంతదూరం నడిచారు. "బొంబాయి వెళ్ళేముందు వుత్తరం రాయి. అడ్రసు మా బావనడుగు" అంది భవాని. అలానే అన్నాడు బ్రహ్మానందం. బండి వేగం హెచ్చింది. ఆగిపోయారు. భవానీ కిటికీలోంచి చూస్తోంది. వాళ్ళిద్దరూ కొద్దిసేపు కనిపించి జనంలో కలిసిపోయారు. బరువుగుండెతో ఆమె కొద్దిసేపు ఏమీ ఆలోచించలేకపోయింది.

సుమారు పన్నెండుగంటలు ప్రయాణంచేసిన తర్వాత మళ్ళీ మామూలు వాతావరణంలోకి వచ్చిపడింది భవాని. మళ్ళీ పాత జీవితం — ఏడుమైళ్ళ ప్రయాణం, బస్సుల గురించి నిరీక్షణ. సాయంకాలానికి జిడ్డుదేరిన ముఖం, రణగొణధ్వని, కంగారు ....

లేబరేటరీ మెట్లెక్కుతుంటే భీమేశ్వరరావు చూసి గబగబా దగ్గర కొచ్చాడు. ఓసారి నిలువెల్లా చూపులతో తడిమి "బావున్నారా, ఎవరికీ చెప్పా చెయ్యకుండా మాయమైపోయారట!" అన్నాడు.

ఆమె ఎంతకీ మాట్లాడకపోతే "ఊరెళ్ళారా, ఏవూరు?" అన్నాడు తిరిగి.

"మావూరే" అంది అక్కడనుంచి కదిలి.

అతనుకూడా ఆమెవెంట బయలుదేరి "ఏమిటీ విశేషం?" అన్నాడు.

"పెళ్ళి సంబంధం వచ్చింది, అందుకని" అంది. అని, అతని ముఖం లోకి సూటిగా చూసింది.

కొద్దిక్షణాలు అతను కలవరపడిన కళ్ళతో ఆమెను చూసి "అలానా" అంటూ నీళ్లు నములుతూ లేబ్ గదులబైట ఆగిపోయాడు. ఆమెకూడా ఆగి "అన్నట్టు! మీ ఆవిడ సీమంతానికి వెళ్ళారటగా మీరు. బాగా జరిగిందా?" అంది.

అతను ఆశ్చర్యపోతూ "అలా అని ఎవరు చెప్పారు?" అన్నాడు.

"ఏమో, ఎవరు చెప్పారో జ్ఞాపకంలేదు. లేబ్ లోనే అనుకున్నట్టున్నారు" అంది. అలా అని మళ్ళీ అతని ముఖంలోకి చూసింది.

అతని ముఖం నల్లగా మాడిపోయింది. హేమంతంలో సంధ్య మీదకు పాకిన చీకటిలాగ నల్లనిపొర అతని కళ్ళల్లోని వెలుగునూ, ముఖంలోని పొడరు కాంతినీ ఆవరిస్తూ నన్నగా కప్పేసింది.

"మా ఆవిడకు సీరియస్‌గావుందని వైరొస్తే వెళ్ళాను" అన్నాడు. ఆ వెంటనే తిరిగి — 'వనుంది, మళ్ళీ కలుస్తాను' అని చెప్పి గబగబా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

వ్యంగ్యమైన చిరునవ్వొకటి ఆమె పెదాలమీంచి పొర్లిపోయింది.

లోపలకు వెళ్ళబోతున్నవాడల్లా చటుక్కున ఆగి వెనక్కు తిరిగిచూస్తే ఆమె నవ్వును ఆపుకోవడం కనిపించింది. పాలిపోయిన పెదాలను పంటితో కొరుక్కుని అతను లేబ్ లోకి వెళ్ళిపోయాడు.

అప్పటినుంచీ అతను దూరం దూరంగానే వుంటూ వచ్చాడు.

పదిహేనురోజుల తర్వాత ఒకరోజు మధ్యాహ్నం ఉత్తరం రాయకుండానే బ్రహ్మానందం వూడిపడ్డాడు. క్లోకు రూములో సామానుంచి, బట్టలు మార్చుకొని వెతుక్కుంటూ లేబ్ కు వచ్చేసరికి ఆలస్యమైందట.

"మధ్యాహ్నంనించి సెలవు పెట్టి వచ్చెయ్యరాదూ" అన్నాడు బ్రహ్మానందం.

"రేపు పెడతాలే" అంది.

"రేపెందుకూ. రేపు ఉదయానికి బొంబాయిలో వుంటాను" అన్నాడు.

"ఏమిటీ! ఇవ్వాళే వెళ్ళిపోతావా. వెళ్లదువుగానిలే. అక్కడ మించిపోయే రాచకార్యాలేమీ లేవుగా. ఉద్యోగ ప్రయత్నాలకని వెళుతున్నావు. ఒకటీ రెండు రోజులు ఆలస్యమైనంత మాత్రాన మించిపోయేదేమీలేదు" అంది.

అతను ఏదో మాట్లాడబోతోంటే మధ్యలోనే ఆపేసి "సరే, యివ్వాళ కూడా సెలవు పెడతాననుకో. ఉండు, ఇప్పుడే వస్తాను" అని లోపలకెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగివచ్చి "పద" అంటూ బయలు దేరింది.

ఇద్దరూ లేబ్ బయటికి వచ్చారు. మరో అరగంటదాగా బస్సులేదు. అంతవరకూ నిలుచోవడం ఎందుకని నడుస్తూ బయలుదేరారు. ఎండ బాగానే వుంది. అయినా దారిపొడుగునా కొంతదూరంవరకూ చెట్లున్నాయి. నీడల్లో ఆగి ఆగి నడుస్తున్నారు. ఇదే మొదటిసారి యిద్దరూ ఒంటరిబాటలోంచి ఒకరిపక్క ఒకరు నడుస్తూ వెళ్ళడం. అంత ఎండలో కూడా ఆమెకు హాయిగావుంది. ఓ చెమట బిందువు అతని కుడి కణత మీదుగాజారి, చెక్కిలిపైన నిలవలేక మెల్లగా కిందకుదిగి, పెదవి అడుగున పల్లంలోకి మళ్ళి చాలా అందంగా అనిపించింది. సిగరేట్ కాలుస్తూ పొగను వదిలేటప్పుడు పెదాలను ఒకవైపు మూసి, మరోవైపు సన్నగా తెరిచి భుజాలమీదనుంచి నిర్లక్ష్యంగా వదులుతున్నాడు. అలా వదిలినప్పుడు కళ్లు కొద్దిగా ముడుచుకుని బరువుగా, మత్తుగా అనిపిస్తున్నాయి. ఆ మత్తులో అతను ఆలోచనల్ని దాచుకున్నట్టు వుంటాడు. అందువల్లే ఒక నిండుదనమూ, ఒక గంభీరతా ఆ ముఖానికి వస్తాయి.

బ్రహ్మానందం ఓ చెట్టునీడలో ఆగిపోయి చూట్టూచూసి "చాలా అందంగా వుందికదూ యీ ప్రకృతి. పల్లెటూరి వాతావరణం! మావూరు జ్ఞాపకాని కొస్తోంది" అన్నాడు.

"అవును. ఊరి పొలిమేర యిది. నీరెండ వాలుతున్న సాయంకాలాల్లో యిక్కడ నడవడం మరీ ఆహ్లాదకరంగా వుంటుంది. అప్పుడప్పుడు నేను అలానే చేస్తుంటాను" అంది.

"వెన్నెల రాత్రులు మరీ అందంగా వుంటాయిక్కడ."

ఆమె చటుక్కున తలెత్తి అతని ముఖంలోకి చూసింది. సిగరెట్టు ఆఖరి దమ్ము గట్టిగా కంఠం కొసవరకూ పీల్చి, చూపుడు వేలితో మీటినట్టు దాన్ని దూరానికి విసిరి, అంచెలు అంచెలుగా పొగను పెదాలమీంచి విలాసంగా వదిలి అక్కడనుంచి మళ్ళీ కదిలాడు.

ఓ చెట్టుకింద నుంచున్న రిషావాడు వాళ్ళు దగ్గర కొచ్చేవరకూ ఆశతో ఎదురుచూసి, వాళ్ళు పక్కనుంచి వెళ్ళిపోతోంటే "రిషా తెమ్మంటారా" అన్నాడు.

"అక్కర్లేదు" అందామె. మెల్లగా నవ్వుకుంది.

ఆ నవ్వును అతను గుర్తించాడు. ఆమె ఎందుకు నవ్విందో అర్థ మయ్యింది. అతనికి గిలిగింతలు పెట్టినట్టయ్యింది.

ఇద్దరూ మరికొంతదూరం నడిచి బస్‌స్టాపు దగ్గర ఆగిపోయారు. ముస్లిం జంట ఒకటి వుంది అక్కడ. వాళ్ళుకాక మరో యిద్దరు మగాళ్ళు వున్నారు. ఆ ముస్లింజంట స్వేచ్ఛగా మాట్లాడుకుంటోంది. ఒకటే వాగుడు, నవ్వులు. ఆ అమ్మాయిది కీచుగొంతు. ఆ భాష అర్థం కావడంలేదు అతనికి, కాని బావుంది. సిల్‌హౌటీలో ఆకారాలు కనిపించకపోయినా అందంగా అనిపించినట్టే వుంది ఆమె మాట్లాడుతోంటే.

తమ మౌనం తమకే ఎబ్బెట్టుగా అనిపించింది. మిగిలిన యిద్దరూ యిటే చూస్తున్నారు. బ్రహ్మానందానికి ఆ పరిస్థితి కొంత ఇబ్బందికరంగా అని పించి సినిమాల గురించి మాట్లాడడం ప్రారంభించాడు. అప్రస్తుతంగా చాలా చాలా విషయాలు చెప్పాడు. తనేమిటి మాట్లాడుతున్నాడో తనకే తెలీకుండా మాట్లాడాడు. ఇక్కడ మంచి సినిమాలే ఆడుతున్నాయన్నాడు. మేటనీవుందే వెళ్ళినా బావుండును అన్నాడు. పోనీలే మానేద్దాం అన్నాడు. బొంబాయిలో చూస్తాగా అన్నాడు. ఏమిటేమిటో మాట్లాడాడు. బస్సు వచ్చేవరకూ అలా

అనర్గళంగా మాట్లాడుతూనే వున్నాడు. ఆమెకు మధ్యమధ్య నవ్వొస్తోందిగాని పెదాలు బిగబెట్టి బలవంతంగా ఆపుకుంటోంది.

బస్సొచ్చింది. ఆ బస్సులో వూళ్లోకి చేరుకున్నారు.

అతను అప్పటివరకూ భోజనం చెయ్యలేదు. అతను బలవంతంచేస్తే అతనితోపాటు ఆమెకూడా మరోసారి హోటల్లో భోంచేయక తప్పలేదు. 'నేను ఉదయం భోజనంచేసే లేబ్‌కు వెళ్ళాను'—అని ఆమె అంటే 'సర్లే, నేనిప్పుడు అడుగుతున్నాను చెయ్యమని, చేస్తావా చెయ్యవా' అన్నాడు. మరిక మారు మాట్లాడలేక పోయింది.

భోజనం చేశాక రూముకు తీసుకెళ్ళింది.

అక్కడ కూర్చున్న కొద్దిసేపటిలోనూ ఆ నాల్గుగోడలమధ్యా ఆమె వొంటరి జీవితాన్ని అతను కొలిచాడు. జాలేసింది అతనికి.

"చాలా బోర్‌గా అనిపించడంలేదూ నీకిక్కడ" అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. తలూపి వూరుకుంది. దానికి సమాధానంగానో ఏమో అయిదు నిమిషాల తర్వాత "మొదట్లో ఒక ఏడాదిపాటు వర్కింగ్ వుమెన్స్ హాస్టలులో వుండేదాన్ని. నాతో కాలేజీలో చదువుకున్న స్నేహితురాలు ఒకసారి కనిపించి యిక్కడ యిల్లు కట్టుకున్నామనీ, వాళ్ళింటికి వచ్చెయ్యమనీ అంటే వచ్చేశాను. ఈ యిల్లే ఆ తర్వాత ఆమెకు పెళ్ళయి వెళ్ళిపోయింది. అప్పటినుంచీ వొంటరితనం అలవాటయిపోయింది. అప్పుడప్పుడు మా అమ్మ వచ్చి వెళుతుంటుంది'' అంది.

ఆ తర్వాత ఆ స్నేహితురాలు గురించి చాలా చెప్పింది. బొంబాయిలో కలుసుకోమని ఆమె అడ్రసుకూడా యిచ్చింది.

నాలుగింటికి టిఫిను, కాఫీ చేసిపెట్టింది. అయిదింటికి వంటకూడా చేసేసింది, వీలయితే సినిమాకు వెళ్దామని. కాని అతను ఆ రోజుకు వుండడానికి వప్పుకోలేదు. తనకుముందు బేచ్‌వాళ్ళు యిద్దరూ బొంబాయిలో వుద్యోగాలు చేస్తున్నారట. వాళ్ళకు ఫలనా బండిలో బయలుదేరి వస్తున్నట్టు వైరిచ్చాడట.

ఆరింటికే భోంచేసి యిద్దరూ బయలుదేరారు. బజార్లో కాస్సేపు తిరిగి స్టేషన్ చేరుకున్నారు.

బండి వచ్చింది. చాలా రష్‌గా వుంది. కూర్చోవడానికి స్థలంలేదు. ఎలాగో సామానులు లోపలసర్ది, కిందకు దిగివస్తే నుంచోవడానికి స్థల. దొరకదని అక్కడే జనం మధ్యలో వుండిపోయాడు. ఆఖరిసారి ఏమన్నా మాట్లాడుకోవచ్చనీ, అతను బాధగా, రహస్యంగా ఏమన్నా చెప్తాడనీ ఎదురు చూసిన ఆమెకు నిరాశే అయ్యింది. బండి కదిలేప్పుడు అతని కళ్ళల్లో బరువును చూసి తన అదృష్టానికి 'ఆమాత్రం భరోసా చాలు' అనుకుందామనుకుంది. కాని ఆ అవకాశం లేకపోయింది. తొంగి చూడడానికి కూడా అవకాశాన్నివ్వ కుండా జనం అతన్ని చుట్టుముట్టేశారు. బండి కదులుతున్నప్పుడు "వెళ్ళొస్తా భవానీ, వుత్తరం రాస్తాలే" అని అరచిన అరుపు కాకిగోలలాంటి ఆ ప్లాటుఫారం శబ్దాల్లో అస్పష్టంగా వినిపించింది.

ఆమె కొంత నిరాశగానే స్టేషను బయటికివచ్చి రిక్షాలో యింటిని చేరుకుంది. సందేహాల్నీ, భయాల్నీ కత్తిరించేసి ఆలోచనలకు ఫ్రేములుకట్టి హాయిగా నిద్రపోయింది.

నాలుగోరోజున అతని దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. మామూలు విషయాలే. ఏ ప్రత్యేకతాలేదు. బొంబాయి గురించీ, ఉద్యోగ ప్రయత్నాల గురించీను.

దానికి సమాధానంకూడా రాసింది.

పదిరోజులవరకూ మళ్ళీ ఏ వుత్తరమూలేదు.

ఒకరోజు ఆఫీసునుంచి యింటికి వచ్చేసరికి యింట్లో వుత్తరం పడి వుంది. బ్రహ్మానందం రాశాడేమో అనుకుంది. ఉత్తరం చించింది. వాళ్ళమ్మ రాయించిన వుత్తరం అది. నాలుగు పేజీలు వుంది. వుత్తరం అంతా అక్కను గురించీ, అక్క పిల్లలను గురించీ; ఇల్లు మరమ్మతులూ, దూరపు బంధువు పురుడూ, పక్కింటి సోమయాజులుగారి తిరుపతి ప్రయాణం —యివేవున్నాయి.

ఆఖర్లో తనకు ఆమెమీద మనసు పోయిందనీ, త్వరలోనే రావాలనుకుంటున్నాననీ, అప్పటికి మాగాయికూడా పెట్టేసి తీసుకొస్తాననీ రాయించింది

చిట్టచివర మరో రెండు వాక్యాలు వున్నాయి. వెంకటప్పయ్యగారి బ్రహ్మానందా నికి చిన్నప్పటినుంచీ అనుకుంటున్న మేనరికమే స్థిరపడిందట. మేనమామ వాళ్ళూ రాజీపడి కాళ్ళబేరానికి వచ్చారట.

భవానీ నిలుచోలేకపోయింది. కళ్ళముందు అంతా చీకటే. మహా ప్రకాశ వంతంతో వెలిగే విద్యుద్దీపం టుప్పున పలిగిపోయి చీకట్లో మునిగిపోయినట్టయి పోయింది. వెల్లువలాగ దుఃఖం ముంచుకొచ్చేస్తోంది. ఆ తాకిడికి పెదాలు కదిలిపోతున్నాయి. కళ్లు తడిసిపోయాయి. కుర్చీలో కూలబడిపోయింది.

నిద్రపోతోన్న హృదయంమీద గిలిగింతలు పెట్టి లేపారు. కళ్లు తెరిచే సరికి తలుపులువేసి చీకట్లోకి తోసేశారు.

కొండంత ఆశతో అందుకున్న మిణుగురు పురుగులతో ఏ జ్యోతీ వెలగ లేదు. చీకటి అలానే మిగిలిపోయింది.

ఆ అందుకునే ప్రయత్నంలో చీకటి పిచ్చుకత్తులు కళ్ళల్లో గుచ్చు కున్నాయి. అవిక వెలుతుర్ని చూడలేవు.

దుఃఖంతో నిండిపోయిన హృదయం ఒక్కసారిగా రబ్బరు బుడగలా పేలిపోయింది. తునకలు దూరంగా చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి.

తూట్లుపడిన హృదయానికి అతుకులువేసినా మునుపటంత అందంగా యికవుండదు.

గాయాలతో మోటుదేరిపోయిన యీ హృదయం సున్నితంగా మరిక ఆలోచించలేదుగాబోలు.

ఆశ రాలిపోయిన హృదయమూ, వన్నె తరిగిపోయిన పుష్పమూ సృష్టి సౌందర్యానికి ప్రతినిధులుగా నిలవలేవు.

గదినిండా చీకటి. ఆమె విడుస్తోన్న వెచ్చటి నిట్టూర్పులు ఆమెనే దహించివేసేలా వున్నాయి. చెక్కిళ్ళమీద జరజరా పాము పాకినట్టు కన్నీటి బిందువులు వుండివుండి ఒక్కొక్కటి చొప్పున పాకి కంఠాన్ని పెనవేసు కుంటున్నాయి. ఆ స్పర్శలో చల్లదనంలేదు. రక్తంలోలాంటి వెచ్చదనం వుంది.

"భవానీగారూ! భవానీగారూ!!" బయట పిలుపు.

కళ్ళుతుడుచుకుని లైటేసి తలుపుతీసింది.

ఇంటివాళ్ళ రామం.

"మా వాళ్లు దేవాలయానికి వెళ్ళినట్టున్నారు— ఇవ్వాళ శనివారం కదూ. మీకుగాని తాళంచెవులు యిచ్చారా?" అన్నాడు.

"లేదు. నేను వచ్చేసరికి ఆలస్యమయ్యింది."

రామానికి ఏంచెయ్యాలో తోచక ఒక నిమిషంపాటు అలాగే నుంచుని "ఏదీ. కాస్త ఆ చాప యిలావేయండి. కాళ్ళులాగుతున్నాయి, చతికిలబడుతాను" అన్నాడు.

ఆమె చాపయిస్తే పరచుకుని కూర్చున్నాడు. అలా కూర్చున్నవాడల్లా రెండునిమిషాలైనా కాకుండానే లేచొచ్చి "చూడండీ; ఆచేత్తోనే కాస్త మంచినీళ్ళిస్తారూ- దాహంగావుంది. వెధవది చీకటిపడినా గాడ్పు తగ్గలేదు" అన్నాడు.

ఆమె కూజావంపి చల్లటినీళ్ళు గ్లాసులో పోసి యిచ్చింది. గడగడా తాగేసి, మిగిలిన కొద్దిపాటి నీళ్ళతో ముఖం తడుపుకుని గ్లాసు పెట్టేసి 'హమ్మయ్య' అంటూ మళ్ళీ కూలబడ్డాడు.

అతన్ని చూస్తే ఆమెకు జాలేసింది. 'పాపం! ఎంతయినా పరాయివాడు. సొంత యింట్లోలా మసలగలడా, కావలసింది అడగ్గలడా, అనుకుంది.

అతనంటే ఎప్పుడూ ఆమెకు జాలే. అయింట్లో అతనికి ప్రేమపూర్వకమైన ఆతిథ్యంలేదు. ఉదయం ఏదో యింతతినేసి ఆఫీసుకు వెళ్ళిపోతాడు. సాయంకాలం ఆఫీసునుంచి నైట్‌కాలేజీకి వెళ్ళి అక్కడ నుండి యింటికొచ్చేసరికి రాత్రి పదవుతుంది. అతనిగురించి అన్నం, కూరలు విడిగా తీసిపెడితే తినేసి నిద్రపోతాడు. ఉదయం మళ్ళీ మామూలే. కాలేజీ చదువు చదువుకుందామని యిక్కడకు వచ్చి పగలు టైపిస్టుగా ఉద్యోగంచేస్తూ, రాత్రిళ్ళు నైట్‌కాలేజీలో చదువుకుంటున్నాడు. ఫైనలియర్‌లోకి వచ్చాడు. అతనంటే ఎవరికీ ఏ ప్రత్యేకతా లేదు. 'స్నేహితురాలున్నప్పుడు శ్రద్ధ చూపించేది. వెళ్ళిపోయాక ఒక్కడూ అయిపోయాడు. నెలనెలా తన ఖర్చుకింద ఆయింట్లో కొంత యిస్తున్నాడు. కాని ఆ యింటివాళ్ళు అతన్ని ప్రతిక్షణం ఒక గుదిబండకిందే భావిస్తుంటారు.

శివానీకి జాలేసింది. కాఫీచేసి యివ్వాలనిపించింది. కాని అకస్మాత్తుగా ఆ జాలినిండిన కళ్ళు ఆమె జీవితంవైపే తిరిగాయి.

మళ్ళీ దుఃఖం కంటి రెప్పలమీదకు బరువుగా వాలింది.

ఆమెకు ఏపనీ చెయ్యాలనిపించలేదు. హోల్డాపరచుకుని, తలుపువేసుకుని, దానిమీద వాలిపోయింది. ఆ రాత్రి ఆమె అన్నం వండుకోలేదు. నిద్రపోలేదు. ఉదయం అద్దంలో తన ముఖాన్ని చూసుకుని భయపడిపోయింది. రాత్రంతా ఏకధారగా గాయాలనుండి రక్తంకారి పాలిపోయిన ముఖమూ, విషాదంలా కళ్ళకింద లోతుల్లో అలముకున్న చీకటీ, పాముల్లా వేలాడుతోన్న తల వెంట్రుకలూచూసి గట్టిగా ఏడవాలనిపించింది.

గబగబా కాలకృత్యాలు తీర్చుకుని జడ అల్లుకుని, నచ్చిన జాకెట్టూ చీరా కట్టుకుని మళ్ళీ అద్దంలోకి తొంగిచూసింది.

కన్నీళ్ళలో తడిసిన కళ్ళల్లో ఏ జ్యోతులూ వెలగడంలేదు. ఎప్పుడేర్పడ్డాయో తెలీదు, కళ్ళకింద ఒంటిరేఖ గీతలు రెండు అర్ధచంద్రాకారంలో ఏర్పడ్డాయి. వయసు వెళ్ళిపోతున్న దనడానికి చిహ్నంగా కణతలపైన, తల వెంట్రుకలు వూడి జుత్తు పలచబడింది. ఆ పక్కనే.... అవును—అదే!

అకస్మాత్తుగా ఆమె అద్దంమీదకు వంగింది. ఆమె ముక్కుకొన చల్లటి అద్దాన్ని తాకుతోంది. కళ్లు పూర్తిగా విచ్చుకున్నాయి. చూపులు ఎటూ కదలక ఒకేచోట ఆగిపోయాయి. గుచ్చిగుచ్చి మరీ చూస్తోంది.

అక్కడ తెల్లటి ఓ తలవెంట్రుక యవ్వనంలోంచి వార్ధక్యంలోకి ఎగిరిన భయంలాగ గాలిలో గజగజలాడిపోతోంది!

ఆమె భయంతో కంపించిపోయింది.

అయిపోయింది! అంతా అయిపోయింది. ఈ జీవితంలోని వెలుగులన్నీ ఆరిపోయాయి. ఆశలా మిగిలిన మిణుగురులుకూడా చెట్లగుబురుల్లో నిద్రపోతున్నాయి. ఏమీ మిగలలేదు. అన్నిదిక్కుల్లోనూ గాఢాంధకారం.... ఆమె యిక ఆలోచించలేకపోయింది. కోపంతో కసిగా ఆ వెంట్రుకను ఊడబెరికింది. దానితోపాటు మరో అరడజను వెంట్రుకలూ ఊడిపోయాయి. తల నొప్పెట్టింది. కళ్ళనీళ్లు తిరిగాయి.

ఇంట్లో యిక కూర్చోలేకపోయింది.

కళ్లు తుడుచుకొని, తలుపులేసుకుని బయటికి వచ్చింది. ఎప్పుడూలేనంత ముందుగా ఆఫీసుకు బయలుదేరి వెళ్ళిపోయింది.

మూడు రోజుల తర్వాత ఒక ఉదయం ఆఫీసుకువెళ్ళే ప్రయత్నంలో వుండగా "మీకు నాటకాలంటే యిష్టమేకదూ" అంటూ రామం వచ్చాడు.

"ఏం?" అన్నట్టు చూసింది ఆమె.

వచ్చే రెండోశనివారం రవీంద్ర భారతిలో 'భాగమతి' అనే నాటకం వేస్తున్నారు. కొంతమంది మిత్రులు కల్చరల్ అసోసియేషన్ ఒకటి స్థాపించి యీ నాటకం తయారుచేశారు. అమ్మిపెట్టమని రెండు రూపాయల టిక్కెట్ల పుస్తకం నాకు అంటగట్టారు. మీకో టిక్కెట్టు కొయ్యమంటారా" పుస్తకం తెరిచి చించడానికి సిద్ధంగా వున్నాడు.

కాస్సేపు ఆమె తటపటాయించి "తీసుకోక తప్పదా" అంది.

"బొత్తిగా అమ్మకుండా పుస్తకం తిరిగి యిచ్చేస్తే బావుండదు. మీరు తీసుకోవాల్సిందే" అన్నాడు.

"సరే యియ్యండి. నాటకానికి మాత్రం నేను రాలేను. డబ్బులు మాత్రం యిప్పుడు యిచ్చేస్తాననుకోండి" అంటూ ఆమె హేండ్‌బేగ్ తీస్తోంది.

"అలాక్కాదు మీరు రావాలి. నాటకం చాలా బావుంటుంది...." అంటూ అతను నటులగురించీ, ఆ నాటకం రచయిత గురించీ, ఆఖర్లో నాటక రచయిత సన్మానం గురించీ చెప్పుకొచ్చాడు.

ఆమె నవ్వి "ఇంత ప్రస్తావన వొద్దులెండి. తెలిసిన ముఖాలు కనిపించవనేతప్ప మరే కారణమూలేదు. వస్తానులెండి" అంది. బేగ్‌లోంచి రెండు రూపాయలు తీసిస్తూ "మరి మీవాళ్లచేత కొనిపిస్తున్నారా, ఊరికే తీసుకెళ్తున్నారా?" అంది. చాలా రోజుల తర్వాత మళ్ళీ విట్సు వస్తున్నాయి తన నోట మ్మాట అనుకుని మెల్లగా నవ్వుకుంది.

అతను కాస్త యిబ్బందిలో పడ్డట్టు మెడ తడుముకుని "వాళ్ళకు పేసు సంపాదిస్తాననుకోండి. అంతగా అవసరమైతే టిక్కెట్లు కొనేస్తాను. ఆ పేసు మీద మీరూ వెళ్లొచ్చుగాని మీలాంటి వాళ్ళచేత టిక్కెట్టు కోయించకపోతే యింకెవరిచేత కోయిస్తాను చెప్పండి" అన్నాడు.

టిక్కెట్టుయిచ్చి తప్పకుండా రావాలిసుమా అని హెచ్చరించి వెళ్ళి పోయాడు.

శనివారం ఉదయం మరోసారి హెచ్చరించాడు. నాటకం హడావిడిలో మధ్యాహ్నం భోజనానికే రాలేదు.

రామం యింటిల్లిపాదీ ఆరింటికే తలుపులు తాళాలు వేసుకుని వెళ్ళి పోయారు. భవానీనికూడా రమ్మంటే 'పనుంది, తర్వాత వస్తా'నని చెప్పింది. నిజానికి ఆమెకు వెళ్ళాలనిపించలేదు. మధ్యాహ్నంనించీ మళ్ళీ మనసు పచ్చి పుండులా అయిపోయింది. బ్రహ్మానందం వుత్తరంరాశాడు. తనకు మేనరికం స్థిరపడినట్టూ, పెళ్ళికి వాళ్ళు తొందర పడుతున్నట్టూ, ప్రస్తుతానికి ఉద్యోగ ప్రయత్నం పక్కకునెట్టి రెండు వారాల్లో స్వగ్రామానికి బయలుదేరనున్నట్టూ రాసాడు. దానితోపాటు ఆమెకు చిన్న సలహాయిస్తూ 'ఒంటరి జీవితంలోంచి నువ్వెందుకు విముక్తురాలవు కావడానికి ప్రయత్నించవూ?' అన్నాడు.

ఆమెకు కోపం ఆగిందికాదు ఆ వుత్తరాన్ని చించి ముక్కలు ముక్కలు చేసింది. కసితో అతనిపేరు ఉచ్చరిస్తూ పళ్ళమధ్య పెట్టి యిష్టం వొచ్చినట్టు ఆ అక్షరాల్ని విరిచేసింది ఉద్వేగాన్ని ఆపుకోలేక ఎగిరిపడుతున్న గుండెను గట్టిగా రెండు చేతుల్తోనూ అదిమిపట్టుకుని కుర్చీలో కూలబడింది.

చివరకు యిలా అయిపోయింది తన జీవితం! ఒకరిచేత చెప్పించుకోవాల్సిన గతిపట్టింది తనకు!

ఆమెకు మనసంతా అదోలా అయిపోయింది.

రామం వచ్చాడు. "తలుపు తాళం వేసివుంది. మావాళ్ళు బయలుదేరి వెళ్ళారు గాబోలు. మీరింకా బయలుదేర లేదేమిటి! లేవండి. నేను వెళ్తున్నాను. అక్కడ కలుసాలెండి! మావాళ్ళు నాగురించి అక్కడ ఎదురు చూస్తుంటారు." కంఠతా పెట్టిన పోర్షనులాగ గబగబా అనేసి ఓ క్షణమన్నా నిలవకుండా, కారుతున్న చెమటనైనా తుడుచుకోకుండా వచ్చిన సైకిలుమీదనే మళ్ళీ వెళ్ళి పోయాడు.

పావుగంటవరకూ ఆమె కదల్లేదు. ఆ తర్వాత ఏమనుకున్నదో ఏమో గబగబా బట్టలు మార్చుకుని, జడ అల్లుకుని నాటకానికి బయలుదేరింది.

ఆమె వెళ్ళేసరికి థియేటరు బయట జనం ఎవ్వరూలేరు. రామం మాత్రం బయట నిలుచుని ఎదురు చూస్తున్నాడు. "అర్ధగంటయ్యింది నాటకం ప్రారంభించి. భలేవారే" అని మందలించి లోపలికి తీసుకెళ్ళాడు. సీట్లు చాలా వరకు నిండిపోయాయి చివర్లో కాళీవుంటే కూర్చుంది. అతను కూడా పక్క సీట్లో అయిదు నిమిషాలపాటు కూర్చుని, ఓ స్నేహితుడు రావాల్సివుంది మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

మొదటి సీను అయ్యాక లైట్లు వెలిగించినప్పుడు చూసింది. యింటి వాళ్ళు ఎక్కడ కూర్చున్నారో అని, వాళ్ళంతా అయిదు రూపాయల వింగ్‌లో కనిపించారు.

మళ్ళీ తెరలేవగానే రామం ఒక్కడూవచ్చి కూర్చున్నాడు. అప్పుడప్పుడు ఆ నటుల గురించీ, వాళ్ళు చేస్తున్న ఉద్యోగాల గురించీ మెల్లగా చెప్తున్నాడు. అలా చెప్తూ ముందుకు వంగినప్పుడు చెమట వాసనా, సిగరెట్టు వాసనా గుప్పున కొట్టింది. ఆ మగాడివాసనకు ఆమె ఓసారి పక్కకు తిరిగి చూసింది. మత్తుగా మసగ్గావున్న వెలుతుర్లో సన్నటి తెరవెనక నుంచి చూస్తున్నట్టుగా అవుపిస్తున్నాడు రామం. చెప్పడం ఆపేసి నాటకం చూడ్డంలో మునిగిపోయాడు.

కొద్దిక్షణాలు ఆమె రెప్పవెయ్యకుండా అతన్నే చూసింది. మళ్ళీ నాటకంలో మునిగిపోయింది.

నాటకం బాగానే వేస్తున్నారు. భాగమతిగా వేస్తున్న అమ్మాయి చక్కగా కుదిరింది. ఆమెముందు హీరో పాత్రకూడా చాలా పేలవంగా అయిపోయింది.

అకస్మాత్తుగా ఆమె పక్కకు చూసింది. కుడిచేతికి ఏదో చల్లగా తగులుతోంది. రామం ఎడమచేతికివున్న వాచీ రేడియండైలు అంకెలు చీకట్లో మెరుస్తున్నాయి. ఆ దిగువనే చల్లగా తాకుతోన్న తెల్లటి స్టెయిన్‌లెస్‌స్టీల్ చైను! రామం పూర్తిగా నాటకంలో మునిగిపోయాడు.

ఆమె చేతిని వెనక్కు తీసుకోలేదు. మధ్యలో ఒకసారి అతనివైపు చూస్తే చేతులుకట్టుకుని కూర్చున్నాడు.

రెండో సీను తెరవాలడంతోనే ఆమెలేచి బయటికి వచ్చేసింది. అతను కూడా బయటికి వచ్చాడు.

"తల నొప్పిగావుంది. నేను వెళ్లిపోతాను. మీరు వుండండి" అంది ఆమె.

అతను కొద్దిసేపు ఆశ్చర్యంగా ఆమెవైపు చూసి "సరేలెండి, టీ తీసుకుని వెళ్లుదురుగాని. తలనొప్పి తగ్గుతుంది, రండి" అంటూ కేంటీను వైపు దారితీశాడు. అక్కడ జనం ఎక్కువగావుంటే దూరంగా నుంచుంది ఆమె. అతను రెండుకప్పులు పట్టుకొచ్చి ఒకటి ఆమెకిచ్చి తనొకటి తీసుకున్నాడు.

టీ బాగా వెచ్చగావుంది. మెల్లమెల్లగా చప్పరిస్తున్నట్టు తాగుతోంది. అలా తాగుతూ ఒకసారి అతని ముఖంలోకి చూసింది. ఆమెకు అరడుగు దూరంలోనే నుంచున్నాడు. తలవంచి టీ తాగుతున్నాడు ముఖంలోకి చూడగానే వొత్తుగా పెంచుకున్న మీసాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. "మీసకట్టు బాగానేవుంది" అనుకుంది. "కాని........"

పెదాలు చుర్రుమన్నాయి. చెయ్యి తొట్రుపడింది. ఆ కంగారులో కొద్దిగా టీ గచ్చుమీద ఒలికింది. ఎవరయినా చూశారేమోనని ఓ సారి చుట్టూ చూసి జాగ్రత్తగా టీ పూర్తిచేసి కప్పుపెట్టేసి వచ్చింది.

అతనుకూడా టీ తాగేసి ఓ మారు కళ్ళజోడు తీసి జేబురుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

ఆ మీసం, ఆ కళ్ళజోడు లేకపోతే మరీ కుర్రాడిలా వుంటాడు- అనుకుంది ఆమె.

మళ్ళీ నాటకం ప్రారంభమైనట్టుంది. జనం లోపలికి వెళ్ళిపోతున్నారు.

"రండి, మిమ్మల్ని రిక్షా ఎక్కించి వస్తాను" అన్నాడు రామం.

ఇద్దరూ నడుస్తున్నారు.

రోడ్డుమధ్య తలమీద తెల్లగా వెలిగిపోతోన్న విద్యుద్దీపం వాళ్ళ బట్టల మీద వెలుగునంతా కుమ్మరిస్తోంది. దాన్ని దాటుకుంటూ వెళ్తున్నప్పుడు వాళ్ళకన్నా ముందుగా వాళ్ళ నీడలే కోరికల్లా గబగబా ముందుకు పరుగులు తీశాయి. ఆ నీడలుచూస్తూ చటుక్కున అతని భుజాలమీదకు చూసింది.

తనఎత్తే. ఆ భుజాలు సరిగ్గా తన భుజాలకు సమానంగా వున్నాయి. హైహీల్ షూ తొడిగింది తను. అతను పల్చటి హవాయిజోడు తొడిగాడు. బూటులోనయితే తనకన్నా పొడుగ్గావుంటాడు. తనకన్నా ఒకటీ రెండేళ్ళు చిన్నగాబోలు. ఎంతయినా ఎదిగే వయసే. మరో రెండేళ్ళకు బాగా పొడుగు పెరతాడు.

ఖాళీ రిషా వస్తోంటే ఆపి బేరమాడాడు అతను. ఆమె రిషాలో కూర్చున్న తర్వాత "తలనొప్పి ఎలావుందిప్పుడు? పోనీ అనాసిన్ వేసుకుంటారేమిటి .... ఓ నిమిషం యిక్కడే వుండండి. ఆ పాన్‌షాపులో వుండేమో కొనుక్కొస్తాను" అంటూ కదలబోయాడు.

ఆ దృశ్యాన్ని ఆమె తన జ్ఞాపకాల ఆల్‌బమ్‌లో దాచుకుందామని కత్తిరించుకుంది.

"అక్కర్లేదు, వొద్దు" అని అతన్ని పంపేసింది.

అతను తిరిగి వెళ్ళిపోతోంటే రిషాలోంచి నాలుగైదుసార్లు వెనక్కు తిరిగి చూసింది. రోడ్డుమీద ఒకరిద్దరు తనవైపు అదోలా చూడ్డంకూడా ఆమె గుర్తించలేదు.

ఇంటికివెళ్ళి అంతరాత్రిలోనూ వంటచేసుకుని తింది. ఇంటివాళ్ళు వచ్చిన అలికిడి, తలుపు తాళం తీస్తోన్న చప్పుడూ, నాటకాన్నిగూర్చిన వాళ్ళ మాటలూ, రామం కంఠమూ వినిపించాయిగాని ఆమె బయటికి రాలేదు.

ఉదయం స్నానం చేద్దామని బాత్‌రూం దగ్గరకు వెళ్ళబోతోంటే ముఖం కడుక్కుంటున్న రామంవచ్చి "తలనొప్పి తగ్గలేదూ, రాత్రల్లా నిద్రలేనట్టు కళ్ళు ఎర్రగా వున్నాయి" అన్నాడు.

"ఎర్రగా వున్నాయా!" అంది ఆమె అతని ప్రశ్నకు సమాధానం చెప్ప కుండా ఎదురుప్రశ్న వేసి. అంతలోకే తిరిగి తనే "రాత్రల్లా నిద్రపట్టలేదు. తలంతా ఒకటేపోటు. తెల్లవారుఝామున మాత్రం కాస్త నిద్రపట్టింది. నిద్రలో దానంతట అదే సర్దుకుపోయిందిలెండి. ఇప్పుడు బాగానేవుంది" అంది.

"అయినా, తలనొప్పి మందువుంది రాసుకోండి యిస్తాను" అంటూ అతను లోపలకు వెళ్ళాడు.

అతను వెళ్ళి ఆమె స్నేహితురాలి తల్లితో చెప్పినట్టున్నాడు. ఆమెవచ్చి "అదేమిటమ్మాయ్! ఒంట్లో బాగోకపోతే స్నానానికెలా బయల్దేరావ్. ఇవ్వాళ్టికి మానేసెయ్. ఇవ్వాళ ఆదివారమేగా కదలకుండా పడుకో. కాఫీకాసి పట్టు కొస్తాను" అంటూ కోప్పడి స్నానం చెయ్యనీయలేదు.

ఏమీలేనిదానికి యింత ఆర్భాటం చేస్తాడేమిటి!—అనుకుంది. రామంమీద కొద్దిగా కోపంకూడా వచ్చింది. ఆ తర్వాత 'కోపంవున్నచోట అభిమానంకూడా వుంటుంది.' అని ఎక్కడో చదివిన విషయం గుర్తుకొచ్చి నవ్వుకుంది. మళ్ళీ అంతలోకే ఏదో చటుక్కున జ్ఞాపకంవచ్చి అద్దంముందుకెళ్ళి నుంచుంది.

ఈ బాధలవల్లా, యీ కన్నీళ్ళవల్లా తన వయసు ఎక్కువగా అనిపిస్తోందికానీ మళ్ళీ తన జీవితంలో వసంతం వెల్లివిరిస్తే చాలా చిన్నదాని లాగే కనిపిస్తుంది. రెండు జడలు వేస్తే మరికొంత వయసు తగ్గుతుంది. నేత చీరల్లో ఓ మాదిరిగా వుంటుందికాని సిల్కు చీరల్లోనూ, వాయిలు చీరల్లోనూ సన్నగానే వుంటుంది. వారానికి ఒకపూట ఉపవాసం వుండే శరీరం యిష్టం వచ్చినట్టు పెరగదు. హైహీల్ షూ తొడగడంమానేసి, ఎర్రపట్టీల ఆకుజోళ్ళు తొడిగితే బావుంటుంది. బొట్టు యింత పెద్దది తీసేసి చిన్నది పెట్టుకోవాలి. కళ్ళల్లో ఎప్పుడూ బరువును నింపకూడదు. పెదాల్ని బిగబట్టకూడదు. వాటి వల్ల ముఖానికి గాంభీర్యం వస్తుంది. అందులో అర్ధసంవత్సరమన్నా వయసు పెరిగిపోతుంది. పెదాల్ని మాటి మాటికీ నాలుకతో తడుపుకొంటుంటే అవి ఎర్రగా, అతి నాజూకుగా, లేతగా అనిపిస్తాయి. అప్పుడప్పుడయినా కళ్ళకు కాటుక పెడితే అది నల్లని బోర్డరులా ఏర్పడి, ఆ మధ్య తెలుపు మరీ ప్రకాశ వంతంగా, స్వచ్ఛంగా కనిపించి జ్యోతులు నింపుకున్నట్టనిపిస్తాయి. చలాకీగా వుండే వయసు తెలీదు. ఎప్పుడూ గతంలోకీ, భవిష్యత్తులోకీ ఎగరకుండా వర్తమానంతో తృప్తిపడుతుండాలి. లేకపోతే ఆలోచనలు ముఖంమీద ముడతలు గీస్తాయి. ఆ ముడతల్లో కాలం ఒకదాన్నొకటి గుణించుకుంటుంది. ఇవన్నీ ఆచరిస్తే ఉన్నవయసుకు కనీసం మూడేళ్ళన్నా తను చిన్నదానిలా కనిపిస్తుంది.

భవానీ మళ్ళీ పరీక్షగా అద్దంలోకి చూసుకుంది. కణతలపైన జుత్తును మరికాస్త ముందుకులాగి, మెలితిప్పి వెనక్కు వేసుకుంది. కళ్ళకింద చిరు మటను పమిటతో తుడుచుకుంది. పెదాల్ని నాలుకతో తడుపుకుని చిన్న

చిరునవ్వు నవ్వుకుంది. అద్దం ముందునుంచి కదిలి కుర్చీలో కూర్చుంటూ మళ్ళీ మరొక్కమారు నవ్వుకుంది.

ఇంటావిడ కాఫీ పట్టుకొచ్చింది. "జ్వరంలేదండీ, బాగానే వున్నాను" అని చెప్తున్నా వినిపించుకోకుండా బలవంతంగా తాగించి కాస్సేపు ఆ విషయమూ, యీ విషయమూ మాట్లాడి వెళ్ళిపోయింది.

ఇప్పుడు మనసంతా తేలిగ్గావుంది. ఏ మోర్నింగ్‌షోకయినా వెళ్తే బావుండునుకాని యింటావిడకు తెలిస్తే ఏమన్నా అనుకుంటుంది.

భవానీ ఎక్కడకూ వెళ్ళకుండా రేడియో పెట్టుకుని యింట్లోనే వుండి పోయింది. వంటచేసుకుని, భోంచేసి నడుంవాల్చింది. చాలాసేపు మత్తుగా, హాయిగా నిద్రపట్టేసింది.

సాయంకాలం యిక యింట్లో కూర్చోలేకపోయింది. ఇంటివాళ్ళ చిన్నమ్మాయిని వెంటబెట్టుకుని అలా ఏ పార్కుకన్నా వెళ్ళివద్దామనివస్తే వాళ్ళులేరు. రామం ఒక్కడేవున్నాడు. ఇంటావిడా, పిల్లలూ, ఆ వీధిలోని సూపర్‌వైజరుగారిఇంటికెళ్ళారట. ఇంటాయన సరేసరి—ఆదివారంవస్తే ఎదురింటి నాగభూషణంగారింట్లోనే పేకాట.

"తలనొప్పి తగ్గిందా మీకు. ఒంట్లో ఎలావుంది?" అన్నాడు రామం.

"అవునుగానీ ఎందుకలా యింట్లోవాళ్ళందర్నీ కంగారుపెట్టారు. అబ్బ! వట్టి భయస్తులు నిక్షేపంగావున్న నాకు నిజంగా జర్వం వచ్చేటంత పనిచేశారు" అంది నవ్వుతూ. పెదాలు తడిచేసుకుంది. పమిట చెంగుతో ముఖం తుడుచు కున్నట్టు తుడుచుకుని కణతలపైని జుత్తును ముందుకు లాక్కుంది. కంటి గుడ్లు అటూయిటూకదిపి ఆ గది నాలుగు మూలల్లోకీ చూసింది.

అతనేమీ మాట్లాడలేదు. నవ్వేసి వూరుకున్నాడు.

"డబ్బు ఖర్చుపెట్టించడమే కాకుండా తలనొప్పికికూడా కారణ మయ్యాను. క్షమించాలి" అన్నాడు కాస్సేపు మౌనంగా వూరుకుని.

"క్షమాపణ చాలా బరువైనమాట. బావుందండోయ్! చాలా బరువు మాటల్నే మాట్లాడుతున్నారే" అని అంది. చిరునవ్వుతో పెదాల్ని తడిపింది. ఓ నిమిషం తర్వాత "నిల్చుండిపోయారేం, కూర్చోండి" అన్నాడతను.

"రండి, ఇక్కడ కూర్చుందాం. కొద్దిగా స్టౌ వెలిగించాల్సినపనికూడా వుంది" అంటూ తనగదిలోకి వెళ్ళిపోయింది. ఆ వెనకనే తలుపులు వేసుకుని అతనూ వచ్చాడు.

ఆమె స్టౌ వెలిగించి ఉప్మాకని తాలింపు పెట్టింది. "రాత్రి నాటకం గురించి మీరేమీ చెప్పలేదు. బాగా జరిగిందా. సన్మానంచేసిన రచయితకు ఏమిచ్చారు?" అంది.

అతను ఆ విషయాలన్నీ చెప్తున్నాడు. ఆమె ఉప్మాచేసేసి టీ పెట్టింది. రెండు ప్లేట్లల్లో సర్ది ఓప్లేటు అతనిముందుపెట్టి "తర్వాత చెప్పుదురుగాని, ముందు యిది తినండి" అంది.

"బావుంది. ఇందుకనేనేమిటి స్టౌ వెలిగించాలన్నారు. ఇప్పుడు యీ శ్రమంతా ఎందుకూ" అన్నాడు అతను.

"మీగురించేకాదు నాగురించికూడానూ" అంది ఆమె. నవ్వింది. కంటి రెప్పల్ని టపటపా కొట్టుకుని కళ్ళపాపల్ని నాట్యంచేయించింది. పవిటచెంగుతో కళ్ళకింద మళ్ళీ తుడుచుకుంది. మనసును ఆలోచనలమీదకు ఎగరనీయక వర్తమానంలోనే కదలకుండా నిలుచోబెట్టింది.

రెండు క్షణాలు అతను ఆమె కళ్ళల్లోకి చూసి తలవంచుకుని గబగబా ఉప్మా తినేశాడు.

"ఉప్మా బ్రహ్మాండంగావుంది. హోటల్లో యీ రుచి వుండనే వుండదు" అన్నాడు.

ఆమె కళ్ళల్లో గబగబా దీపాలు వెలిగిపోయాయి. మూలమూలల్లోని కోణాల్లోకికూడా వెలుతురు చారలు పాకుతూవెళ్ళి చీకట్లను నెట్టేశాయి.

"నిజానికి వంట చెయ్యడంలో నాకంత నేర్పులేదు. నామీద అభిమానం వల్ల మీకు అలా అనిపించింది" అంది.

"అభిమానంతో అనలేదు. కేవలం అభిమానంతోనే అనుంటే మరికాస్త వేయించుకుని తినేవాడినే" అన్నాడు.

"అయితే మీరు మరికాస్త వేయించుకుని తినాల్సిందే" అంటూ మిగిలిన ప్లేటు ఉప్మాకూడా తెచ్చి, అతను చేతులు అడ్డుపెట్టి వద్దంటున్నా వినిపించుకోకుండా చేతుల్ని పక్కకునెట్టి ప్లేటులో వడ్డించింది.

"నాగురించైనా తినండి. చూడండి .... యిలా నా ముఖంలోకి చూసి చెప్పండి. నాగురించి ఆమాత్రం తినలేరూ."

చెమ్మగిల్లిన కళ్ళతో అతను ఆమె ముఖంలోకి కొద్దిసేపు తేరిపార చూసి "చిన్నప్పటినుండీ నాకు యీ అభిమానానికి కొరతలేకుండా వుంది. అది నా అదృష్టం. ఈ అభిమానమేగాని కొరతపడివుంటే నేను బ్రతికివుండేవాడిని కానేమో" అన్నాడు. తృప్తిగా ఆ ఉప్మాకూడా తినేకాడు తలెత్తిచూస్తే ఆమె యిటే చూస్తోంది. కళ్ళను ఆర్పకుండా చూపుల్ని అతని మీదనే నిలిపింది. ఆలోచిస్తున్నట్టుంది. కంటిపాపలు మంత్రించినట్టు కదలడంలేదు. మధ్యలో ఆగిపోయాయి. ఆ కంటిపాపల మధ్య తెల్లటి చుక్కలా అతను ప్రతిఫలిస్తున్నాడు. అతనికే సిగ్గేసింది. ఆ కళ్ళల్లోకి చూడలేకపోయాడు. తల వంచుకున్నాడు ఓ నిమిషం తర్వాత తలవంచుకునే పైకిచూశాడు. ఇంకా అలానే చూస్తోంది. మెల్లమెల్లగా ముడులుసడలి సన్నగా, పొడుగ్గా సాగిన పెదాలు, పెదాలమీద తడి, అతనిమీద నిలవక జారిపోతున్న చిరునవ్వులు, కళ్ళల్లో ఎప్పుడూ చూడని ఓ కొత్త కాంతి. ఆ కాంతిలో తెల్లదనంలేదు. అదోరకమైన పల్చటి కాషాయరంగు తగలబడిపోతోన్న తాటాకుపాక వొదిలిన లేత ఎరుపు రంగు. కళ్ళల్లో తడిలేదు. పొడి కళ్ళవి. దప్పికగొన్న కళ్ళు. ఆ చూపులు తననే తినేసేంత ఆకలితో వున్నాయి.

"భవానీగారూ !"

కలలోంచి కదిపినట్టు ఉలిక్కిపడింది.

"మంచినీళ్ళు కావాలి"

పూర్తిగా వదలని మత్తులోంచి మహారాణిలా మెల్లగా కదిలివెళ్ళి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చియిచ్చింది. మళ్ళీ ఆ ఎదుటి కుర్చీలో కూర్చుంది.

గడగడా, ఎత్తినగ్లాసు దించకుండా, ఒక్కగుక్కలో గ్లాసు ఖాళీచేసి, తీరుబడిగా ఆమెవైపుతిరిగి అన్నాడు—

"భవానీగారూ! ఎందుకోగాని మిమ్మల్ని చూసినప్పుడల్లా నాకు ప్రభావతి జ్ఞాపకం వస్తుందండి. మీలా వుండదనుకోండి. ఆ అప్యాయతా ఆ ప్రేమా — అన్నీ మిమ్మల్ని జ్ఞాపకం చేస్తాయి. స్కూలు ఫైనలు చదువుకునే రోజుల్లో వాళ్ళింట్లో వుంటుండేవాడిని. వాళ్ళూ బీదవాళ్ళే. అందుకే వారాలమీద బతకవలసివచ్చింది. ప్రభావతికి నేనంటే ఎంత అభిమానమో చెప్పలేను. పాపం! యింట్లో ఏంచేసినా దాచిపెట్టి మరీ యిస్తుండేది. మిమ్మల్ని చూస్తుంటే నాకు ఆ ప్రభావతి అక్కయ్యే జ్ఞాపకానికొస్తోంది."

భవాని తాచుపాము లేచినట్టు చివాల్న కుర్చీలోంచి లేచింది. ముఖం కందగడ్డలా అయిపోయింది. కళ్ళు వికృతంగా పగిలిపోతున్నాయి. చితిలోంచి సమాధులమీదకు పాకిన రక్తకిరణాల్లా, సముద్రాన్ని చీలుస్తోన్న అగ్నిగోళం కక్కిన జ్వాలల్లా ఎరుపురంగు మెలమెల్లగా ముఖం మీదకు పాకుతోంది. పెదాలు దగ్గరగా ముడుచుకుపోయి కుంచించుకుని అసహ్యంగా ఒకదాన్నొకటి పెనవేసుకుంటున్నాయి. ఆ వెనక భూకంపం వొచ్చేస్తోంది. పెదాల పట్టు సడలిపోతోంది. వెచ్చని లావాసెగలు బైటికొస్తున్నాయి. ఏ క్షణమైనా బ్రహ్మాండమైన శబ్దంతో పెదాలు విచ్చుకుని నిప్పులుకక్కే లావా ఒక్కసారిగా పొర్లిపోయేట్టువుంది. పెదాలమీద పళ్ళను మేకుల్లాదిగేసి కదలనీయకుండా అణిచిపడుతోంది ఆమె. కాని లావాసెగలు కళ్ళల్లో కొట్టాయి. కళ్ళల్లో మంట. ఎర్రటి, వెచ్చటి మంట. రెప్పల్ని బిగించి ఆర్పబోయింది. ఆ రెప్పల్ని తోసుకుంటూ రెండు కళ్ళల్లోంచీ రెండు కన్నీటి చుక్కలు!

రామం తెల్లబోయాడు. అతని ముఖంలో ఆశ్చర్యంసాగి, మెలికలు తిరిగి ప్రశ్నగా మారింది.

(1967)

★